www.prajamantalu.com
Praja mantalu, Jagtial
# ప్రజా మంటలు
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు
సంపుటి : 5 పేజీలు - 8
సంచిక : 04 వెల - రూ. 5 : 00
మంగళవారం 05 మార్చి 2024

## అమెరికాలో మళ్లీ కాల్పులు



6లో..

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

# తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

- ఆదిలాబాద్ కేంద్రంగా 6వేల కోట్ల పనులకు శ్రీకారం
- విద్యుత్, రైల్వే ప్రాజెక్ట్ పనులు ప్రారంభించిన ప్రధాని మోడీ
- తెలంగాణకు పెద్దన్నలా సహకరించాలన్న సిఎం రేవంత్
- ఆదిలాబాద్ పర్యటనలో ప్రధానికి ఘనంగా స్వాగతం

## అన్ని విధాలా సహకారం అందిస్తాం



**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రజా మంటలు):** కేంద్రంలోని భాజపా ప్రభుత్వం దేశాభివృద్ధికి కృషి చేస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ఆదిలాబాద్‌లో రూ.7వేల కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులను ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. రామగుండం ఎన్టీపీసీలో 800 మెగావాట్ల విద్యుత్ కేంద్రాన్ని జాతికి అంకితం చేశారు. దీంతో పాటు రైల్వే అభివృద్ధి పనులను ప్రారంభించారు. దేశంలోని అనేక రాష్ట్రాలు అభివృద్ధిలో దూసు కెళ్తున్నాయి. తెలంగాణ ఏర్పడి పదేళ్లు అయింది. ఈ రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని అన్నారు. పేదలు, దళితులు, ఆదివాసీల అభివృద్ధికి కృషి చేస్తుంది. గత పదేళ్లలో పేదరికం నుంచి 25 కోట్ల మంది బయటపడ్డారని మోదీ అన్నారు. ఆదిలాబాద్‌లో వర్చువల్ విధానంలో రూ.6 వేల కోట్ల ప్రాజెక్టుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ఆయన.. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. 'రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్‌కు సంపూర్ణంగా సహకరిస్తాం. తెలంగాణలో గడిచిన పదేళ్లలో రూ.56 వేల కోట్లకుపైగా పనులు ప్రారంభించాం. అభివృద్ధిలో కొత్త అధ్యయనాన్ని లిఖించాం అని అన్నారు. అంబారీ - ఆదిలాబాద్ - పింపాలకుట్టీ రైల్వే విద్యుద్దీకరణను జాతికి అంకితం చేశారు. మంచిర్యాల జిల్లా రామగుండంలోని ఎన్టీపీసీ రెండో థర్మల్ పవర్ యూనిట్‌ని ప్రారంభించారు. దేశంలో నేడు జరుగుతున్న అభివృద్ధికి ఆదిలాబాద్ ఓ ఉదాహరణగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. రామగుండం ఎన్టీపీసీ స్టేజ్ వన్ పవర్ ప్లాంట్‌ను జాతికి అంకిత చేసిన ప్రధాన మంత్రి వర్చువల్‌గా పలు శంకుస్థాపనలు చేశారు. ములుగు, బేలాలో రెండు జాతీయ రహదారులకు, ఆరు ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడిన ప్రధాని తెలంగాణ ప్రజల కలల సాకారానికి కేంద్రం ఎప్పుడూ ముందే ఉంటుందని తెలియజేశారు. తెలంగాణ ఏర్పడి పదేళ్లు పూర్తవుతుందని... అన్ని రంగాల్లో రాష్ట్రం అభివృద్ధి చెందాలని తాము ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. అందుకే హైవేల నుంచి అన్ని విభాగాల్లో సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. అందులో భాగంగా 56 వేల కోట్లు అభివృద్ధి పనులు మిగతా 2లో..

## రాష్ట్రాభివృద్ధిలో రాజీలేదు

- ఘర్షణాత్మక వైఖరి సరికాదు
- కేంద్రంతో సయోధ్యనే కోరుకుంటున్నాం
- ఆదిలాబాద్ సభలో సిఎం రేవంత్ రెడ్డి



**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రజా మంటలు):** ప్రధాని మోదీ రాకను నాలుగు కోట్ల మంది ప్రజలు స్వాగతిస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. ఘర్షణ వాతావరణం వస్తే ప్రజలకు మంచిది కాదని చెప్పారు. ఎన్నికలప్పుడే రాజకీయాలని, తరవాత అభివృద్ధి ఎజెండా కావాలన్నారు. పదేపదే ఘర్షణాత్మక వైఖరి వల్ల నష్టపోయేది రాష్ట్రాల ప్రజలేనని అన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డ తరవాత అనేక విషయాలను ప్రధాని దృష్టికి తీసుకని వెళ్లామన్నారు. రోణభూములు సహా అనేక విషయాలను పరిష్కరించారని అన్నారు. అదిలాబాద్‌లో మిగతా 2లో..

## వికసిత భారత్‌కు మీ మద్దతు కావాలి

అభివృద్ధిలో మీ భాగస్వామ్యం ఎంతో ముఖ్యం

కాళేశ్వరం అవినీతిలో విచారణపై అనుమానాలు

ఆదిలాబాద్ విజయ సంకల్ప సభలో ప్రధాని మోడీ



వార్త 2లో

## దేశ ముఖచిత్రాన్ని మార్చిన ప్రధాని మోడీ

2లో

ఆదిలాబాద్ సభలో కిషన్ రెడ్డి

## ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అమలు చేయాలి

ప్రభుత్వం నిర్ణయంపై 6న హైదరాబాద్‌లో ధర్నాలు

7న కలెక్టర్, ఆర్డీవోలను కలిసి వినతి పత్రాలు సమర్పణ

బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ వెల్లడి



**హైదరాబాద్, మార్చి 4 (ప్రజా మంటలు):** ఎల్‌ఆర్‌ఎస్‌పై తెలంగాణ సర్కార్ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బీఆర్ఎస్ పోరు బాటకు దిగింది. 6న అన్ని నియోజకవర్గాల్లో, హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలకు పిలుపునిచ్చింది. 7న జిల్లా కలెక్టర్, ఆర్డీవోలను కలిసి వినతి పత్రాలు సమర్పించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలపై ఆర్థిక భారం మోపడానికి కాంగ్రెస్ ప్రభుత్వం రంగం సిద్ధం చేసిందన్నారు. తాము తెచ్చిన పథకాలకు ఆనాడు అడ్డు చెప్పి ఇప్పుడు అవే పనులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ నేతలు నాలుక మడతేశారని విమర్శించారు. తాము ఎల్‌ఆర్‌ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆనాడు కోర్టులో కేసు వేశారని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని భట్టి విక్రమార్క అన్నారని.. ఉచితంగా భూములు క్రమబద్దీ కరిస్తామని ఉత్తమ్ చెప్పారన్నారు. దోచుకోవడానికి ఎల్‌ఆర్‌ఎస్ తెచ్చారని సీతక్క కూడా అన్నారని తెలిపారు. ప్రజల నుంచి 20వేల కోట్లు భారం ప్రజలపై వేయడానికి ఎత్తుగడ వేశారని మండిపడ్డారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై వేసిన పిల్ ఏమైంది కోమటిరెడ్డి అని ప్రశ్నించారు. భట్టి, సీతక్క కూడా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రభుత్వం వైఖరి మార్చుకోవాలని హితవుపలికారు. మార్చి31లోపు వసూలు చేయాలని టార్గెట్ పెట్టుకున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒకలా అధికారంలో ఉన్నప్పుడు ఒకలా ఉన్న కాంగ్రెస్ వైఖరిని ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఎల్‌ఆర్‌ఎస్‌కు నిరసనగా 6న అన్ని నియోజక వర్గాల్లో, హైదరాబాద్‌లో జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాల వద్ద రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు చేపడతామని. 7న జిల్లా కలెక్టర్, ఆర్డీవో లను కలిసి వినతి పత్రాలు ఇస్తామని, పార్టీ పక్షాన న్యాయ పోరాటం కూడా చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2020 నుంచి పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ మిగతా 2లో..



## లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్..

- కరీంనగర్‌కు వినోద్ కుమార్..ఖమ్మంనకు నామా
- మహబూబాబాద్ దక్కించుకున్న మాలోత్ కవిత
- పెద్దపల్లికి మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్ వార్త 2లో

## క్యానర్సర్ బారిన పడ్డ ఇస్రో చైర్మన్

స్వయంగా వెల్లడించిన సోమానాథ్ 3లో

## ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

11న భద్రాద్రిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం

సిఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం వార్త 3లో

## భువనగిరి అడిషనల్ కలెక్టర్‌పై వేటు



భువనగిరి,**మార్చి 4 (ప్రజా మంటలు):** యాదాద్రి భువనగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) భాస్కరరావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఆయనను సస్పెండ్ చేస్తూ తెలంగాణ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని నల్గొండ, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో నాలుగేళ్ల నుంచి విధులు నిర్వహిస్తూ.. ఇంకా మూడేళ్లు పూర్తి కాలేదని తప్పుడు నివేదిక ఇవ్వడంతో విచారణ జరిపిన ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంది.


## కారు బీభత్సం..

వేగంగా వచ్చి చెట్టును ఢీకొన్న కారు

ముగ్గురు చిన్నారులతో పాటు ఐదుగురు మృతి

వనపర్తి, **మార్చ్ 04 (ప్రజామంటలు):** రోడ్డు ప్రమాదాలు ఎన్నో కుటుంబాలను శోకసంద్రంలో ముంచుతున్నాయి. ప్రమాదాల్లో అభం శుభం తెలియని చిన్నారులు కూడా మృత్యువాత చెందుతున్నారు. తాజాగా వనపర్తి జిల్లా కొత్తకోట వద్ద సోమవారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు సహా ఐదుగురు మృత్యువాత చెందారు. సోమవారం తెల్లవారుజామున కొత్తకోట వద్ద జాతీయ రహదారిపై వేగంగా దూసుకొచ్చిన ఓ కారు అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే కారులో ప్రయాణిస్తున్న ఐదుగురు మృతి చెందారు. మిగతా 3లో..

## ప్రజా నాడి




## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దం

- సమాజం గౌరవించేలా చేయండి
- గంజాయి లాంటి మత్తు పదార్థాలకు దూరం చేయండి
- ఉద్యోగాల కోసం కాదు..సమాజం కోసం పనిచేయండి
- పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి
- నేను కూడా ప్రభుత్వ స్కూల్ నుంచే వచ్చారు
- ఎల్బీ స్టేడియంలో టీచర్లకు ఉద్యోగ నియామక పత్రాలు
- భారీ సభలో అందచేసిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, మార్చి 4 (ప్రజా మంటలు):** విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దే క్రమంలో టీచర్లు వారికి మంచి సుగుణాలు అలవడేలా తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి మిగతా 2లో..

## మెట్రో రెండో దశకు ముహూర్తం ఖరారు

- ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5.కిలోమీటర్ల మెట్రో
- 8న శంకుస్థాపన చేయనున్న సిఎం రేవంత్



**హైదరాబాద్, మార్చి 4 (ప్రజా మంటలు):** మెట్రో రైలు రెండో దశ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 8న పాతబస్తీలో రెండో దశకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు 5.5.కిలోమీటర్ల మెట్రో మార్గానికి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి

# తెలంగాణ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : అన్ని విధాలా సహకారం అందిస్తాం

చేపట్టామని తెలియజేశారు. ఆర్థిక వ్యవస్థ బలోపేతం అయితేనే రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయని దాని ద్వారా దేశం బలపడుతోందని వివరించారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వచ్చిన మోదీకి ఘన స్వాగతం పలికినట్లు రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. వివిధ ప్రాజెక్టులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసే వేదికపై మాట్లాడిన రేవంత్... మోదీని పెద్దన్నగా అభివర్ణించారు.. గత ప్రభుత్వ నిర్ణయాలతో విద్యుత్ సహా చాలా రంగాల్లో వెనుకబడ్డామని తెలిపారు. కేంద్రంతో ఘర్షణపూరిత వైఖరితో ఉంటే రాష్ట్రం అభివృద్ధిలో వెనుబడుతుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి పెద్దన్నగా భావించి పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను త్వరితగతిన అనుమతులు ఇవ్వాలని వేడుకున్నారు. పాలన విషయంలో, తెలంగాణ ప్రజల బాగోగుల విషయంలో తమకు ఎలాంటి భేషజాలు లేవని రేవంత్ అన్నారు. గుజరాత్‌లా అభివృద్ధి సాధించాలంటే తెలంగాణకు ప్రధానమంత్రి మోదీ సాయం కావాలని విజ్ఞప్తి చేశారు ప్రధానమంత్రి తమకు పెద్దన్న లాంటి వ్యక్తి అని విభజన చట్టంలోని చాలా విషయాలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. అలాంటి వాటిలో విద్యుత్ ఒకటని పేర్కొన్నారు. నాలుగువేల మెగావాట్లకు బందులు కేవలం 1600 మెగావాట్ల విద్యుత్ మాత్రమే సాధించామని పేర్కొన్నారు. మిగిలిన వాటిని త్వరగా క్లియర్ చేయాలని విజ్ఞప్తి చేశారు. భారత్ ఐదు ట్రిలియన్ ఎకానమిని సాధించేందుకు తెలంగాణ ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రానికి కంటోన్మెంట్‌లో రక్షణ శాఖ భూములు బదలాయించడం అభివృద్ధిలో మరో అడుగుగా అభివర్ణించారు. స్కైవేల నిర్మాణానికి ఎంతో సహకారిస్తుందన్నారు. అంతకు ముందు మాట్లాడిన కేంద్రమంత్రి కిషన్ రెడ్డి...తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి కేంద్రం అనేక విధాలుగా సాయం చేస్తుందని తెలిపారు. భవిష్యత్‌లో కూడా అలాంటి సాయం అందుతుందని భరోసా ఇచ్చారు. అన్ని విధాలా తెలంగాణ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తున్న ప్రధానమంత్రికి ప్రజల తరుపున కిషన్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి,



తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. రామగుండంలో యూరియా కంపెనీని మోదీ ప్రారంభించారని తెలిపారు. వరంగల్‌లో వ్యాగన్ తయారీ కంపెనీకి శంకుస్థాపన చేశారన్నారు. రాష్ట్రంలో రూ.30 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు, తెలంగాణ నుంచి మూడు వందేభారత్ రైళ్లు ప్రారంభించారన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్రం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు.రెండు రోజుల పర్యటన నిమితం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ చేరుకున్నారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు పాల్గొనేందుకు ఆదిలాబాద్ వచ్చిన ప్రధానమంత్రికి తెలంగాణ గవర్నర్ తమిళిసై, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఇతర నేతలు స్వాగతం పలికారు. సోమవారం ఉదయం జిల్లాకు చేరుకున్న ప్రధానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించిన సభలో మోదీ పాల్గొన్నారు. పర్యటనలో భాగంగా మోదీ పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకు స్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రామగుండం ఎన్‌టీపీసీ పవర్ ప్లాంట్‌ను ప్రధాన మంత్రి జాతికి అంకితం చేశారు. ఒక ప్రధాన మంత్రి ఆదిలాబాద్‌కు రావడం 41 ఏళ్ల తర్వాత ఇదే తొలిసారి.

## రాష్ట్రాభివృద్ధిలో రాజీలేదు



పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధిలో రాష్ట్రానికికి మోదీ పెద్దన్నలాగా ఉన్నారని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి రక్షణ శాఖ భూములు ఇచ్చినందుకు సిఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. తమ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సహకారం మరింత కావాలని కోరారు. రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడానికి అవసరమైన కార్యాచరణ తీసుకున్నామని అందుకు సహకరించాలని కోరారు. ఎన్టీపీసీకి రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని చెప్పారు. 'మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి తెలంగాణకు వచ్చిన ప్రధానికి స్వాగతం.. గత ప్రభుత్వ నిర్ణయాలతో విద్యుత్ ఉత్పత్తిలో వెనకబడ్డాం.. విభజన చట్టంలో 4 వేల మెగావాట్లకు బదులు 1600 మెగావాట్ల విద్యుత్ మాత్రమే సాధించాం.. మిగిలిన 2,400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి కేంద్రం సహకరించాలి' అని రేవంత్ రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వంతో ఘర్షణ వైఖరి ఉంటే రాష్ట్రాభివృద్ధికి ఆటంకమని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్‌లో వివిధ అభివృద్ధి పనులను సోమవారం ప్రధాని మోదీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు గవర్నర్ తమిళిసై, సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రంతో కలిసి ముందుకెళ్తామన్నారు. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు చేయాలన్నారు. ఎన్టీపీసీకి కాంగ్రెస్ ప్రభుత్వం సహకరిస్తుందని చెప్పారు. కంటోన్మెంట్ స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేసినందుకు ప్రధానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. పెద్దన్నలా మోదీ సహకారం అందించాలని కోరారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధిలో సహకరిస్తున్న ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ప్రజల తరపున ప్రధాని మోదీకి కృతజ్ఞతలు. ప్రాజెక్ట్‌లో మిగిలిన వాటికి అన్ని విధాలుగా సహకరిస్తాం. మా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటిసారి తెలంగాణకు వచ్చిన ప్రధానికి సాదర స్వాగతం. గత ప్రభుత్వ నిర్ణయాలతో విద్యుత్ ఉత్పత్తిలో వెనుకబడ్డాం. కేంద్రంతో పదేపదే ఘర్షణాత్మకమైన వైఖరితో ఉంటే రాష్ట్ర అభివృద్ధి వెనుకబడుతుంది. రాష్ట్రాభివృద్ధి కార్యాచరణతో ముందుకెళ్తాం. మావైపు నుంచి ఎలాంటి భేషజాలు లేవు. గుజరాత్‌లా తెలంగాణ అభివృద్ధి చెందేందుకు మీ సహకారం కావాలి. ప్రధానమంత్రి అంటే మాకు పెద్దన్నలాంటివారు. విభజన చట్టంలో నాలుగువేల మెగావాట్లకు బదులు కేవలం 1600 మెగావాట్ల విద్యుత్ మాత్రమే సాధించాం. దేశంలో ఐదు ట్రిలియన్ ఎకానమీ సాధనకు తెలంగాణ సహకరిస్తుంది. కంటోన్మెంట్ రక్షణ శాఖ భూములను రాష్ట్రానికి బదలాయించారు. ఇది తెలంగాణ అభివృద్ధిలో కీలకమైన స్కైవేల నిర్మాణానికి ఇది ఉపయోగ పడుతుంది. ఆదిలాబాద్‌కు నీళ్లు ఇవ్వాలంటే తుమ్మిడిహట్టి నిర్మించాలి. దీని కోసం భూసేకరణకు కావాల్సిన పరిహారాన్ని తెలంగాణ ప్రభుత్వం చెల్లిస్తుంది. రాష్ట్ర అభివృద్ధికి సహకరించండని కోరారు.

## దేశ ముఖచిత్రాన్ని మార్చిన ప్రధాని మోడీ

### ఆదిలాబాద్ సభలో కిషన్ రెడ్డి



**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రజా మంటలు):** ఆదిలాబాద్‌లో బీజేపీ నిర్వహించిన సభలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. పదేళ్లలో దేశ ముఖచిత్రాన్ని ప్రధాని మోదీ మార్చేశారిన అన్నారు. అభివృద్ధిక ఇదేశాన్ని నమూనాగా నిలిపారని అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ నుంచి బీజేపీకి 17 సీట్లు రావాలి. కేసీఆర్ పార్టీ నిన్నటి పార్టీ. ఇచ్చిన హామీలను కాంగ్రెస్ అమలు చేసే పరిస్థితి లేదు. కుటుంబ, అవినీతి పాలనను కేసీఆర్ తెలంగాణ ప్రజలపై రుద్దారని మండిపడ్డారు. ఆర్థిక వ్యవస్థ బలపడితే దేశంపై విశ్వాసం పెరుగుతుంది. పేదలు, దళితుల అభివృద్ధికి కేంద్రం అనేక చర్యలు చేపట్టింది. వచ్చే పదేళ్లలో భారత్ అభివృద్ధిపరంగా మరింత ముందుకెళ్తుంది. కేంద్రం తీసుకున్న చర్యలతో దేశవ్యాప్తంగా 25కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారని అన్నారు. ఇప్పటికే తెలంగాణలో ప్రధాని మోదీ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారు. పలు ప్రాజెక్ట్‌లను ప్రారంభించారు. తెలంగాణ అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని అన్నారు. రాష్ట్రంలోని 17 ఎంపీ సీట్లకు గాను ఇప్పటికే 9 మంది అభ్యర్థులను బీజేపీ నాయకత్వం ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో ప్రధాని సభలు పార్టీ యంత్రాగానికి మరింత ఊపు తెస్తాయని బీజేపీ నేతలు భావిస్తున్నారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ పర్యటనల నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాటు చేశారు.ఎస్పీజీ భద్రతా వలయంలో ఏరోడ్రం, ఇందిర ప్రియదర్శిని స్డేడియంలు చేరాయి. రెండువేల మంది భద్రతతో రక్షణ వలయం ఏర్పాటు చేశారు. రాజకీయ వేదికపైకి వెళ్లి బహిరంగ సభలో మోడీ ప్రసంగించారు. ఇందులో కిషన్‌రెడ్డితో పావిటు ఒకరిద్దరు కేంద్ర మంత్రులు, పార్టీ నేతలు బండి సంజయ్, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు. ఆదిలాబాద్‌లో పార్టీ వేదికపైకి చేరుకున్న ప్రధాని మోడీకి కిషన్ రెడ్డి, బండి సంజయ్, సోయం బాపూరావ్, నలుగురు ఎమ్మెల్యేలు స్వాగతం పలికారు.

## మెట్రో రెండో దశకు ముహూర్తం ఖరారు

పనులు మొదలుపెట్టనున్నారు. సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, ఫలకనుమా మధ్య నాలుగు స్టేషన్లతో ఈ కారిడార్ అందుబాటులోకి రాబోతోంది. రెండో దశలో మొత్తం 70 కి.మీ. కొత్త రైలు మార్గాన్ని నిర్మించాలని నిర్ణయించిన రాష్ట్ర ప్రభుత్వం.. రూట్‌మ్యాప్‌లను ఖరారు చేసింది. అందులో భాగంగా ఈ నెల 8న రెండో దశలోని 5.5 కి.మీ మార్గానికి సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు మెట్రో అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో ప్రస్తుతం మెట్రో రైలు మూడు కారిడార్‌లో 69 కి.మీ మేర అందుబాటులో ఉంది. మియాపూర్ నుంచి ఎల్బీనగర్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్, నాగోల్ నుంచి రాయదుర్గం వరకు కనెక్టివిటీ ఉంది. కొత్తగా నిర్మించే 5.5 కి.మీ. అందుబాటులోకి వస్తే సికింద్రాబాద్, జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్ మీదుగా నేరుగా ఫలక్‌నుమాకు చేరుకోవచ్చు. కారిడార్ 4, 5, 6, 7 మార్గాల్లో రూట్ మ్యాప్‌ను సిద్ధం చేసిన ప్రభుత్వం.. వాటి నిర్మాణానికి శంకుస్థాపన ఎప్పుడనేది వెల్లడించాల్సి ఉంది. ఈ మార్గం రాకతో నిత్యం రద్దీగా ఉండే ఏరియాలో ట్రాఫిక్ తిప్పలు తప్పించడానికి మెట్రో ట్రైన్ మంచి మార్గం సుగమం కానుంది.. మూడు లైన్లుగా గ్రేటర్ హైదరాబాద్ లో 2017 నుంచి మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం 69కి. మీటర్ల పొడవు ఉన్న లైన్ మార్గాన్ని మొదటి దశ విస్తరణలో భాగంగా 74 కి. మీటర్లుకు పెంచుతున్నారు. ఎన్నో ఎళ్లుగా హైదరాబాద్ లో పాత బస్తీ ప్రాంతంలో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. అయితే హైద్రాబద్ మెట్రో రైల్ సంస్థ తీసుకున్న నిర్ణయంతో పాతబస్తీకి మెట్రో మోక్షం కలగనుంది. జేబీఎస్ నుండి ఎంజిబిఎస్ వరకు ఉన్న గ్రీన్ లైన్ మెట్రో మార్గాన్ని ఓల్డ్ సిటీ మీదుగా ఫలక్ నుమా వరకు పొడిగించ నున్నారు. ఈ మేరకు మార్చి 8న ఓల్డ్ సిటీలో 5 కి.మీ మెట్రో లైన్ నిర్మాణ ప్రాజెక్టుకు భూమి పూజ చేయనున్నట్లు హైద్రాబద్ మెట్రో రైల్ సంస్థ వెల్లడించింది. ఇది పూర్తి అయితే ఓల్డ్ సిటీ, ఫలక్ నుమా వైపు వెళ్లే ప్యాసింజర్స్ కు ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయి.

## వికసిత భారత్‌కు మీ మద్దతు కావాలి

### అభివృద్ధిలో మీ భాగస్వామ్యం ఎంతో ముఖ్యం

### కాళేశ్వరం అవినీతిలో విచారణపై అనుమానాలు

### ఆదిలాబాద్ విజయ సంకల్ప సభలో ప్రధాని మోడీ

**ఆదిలాబాద్, మార్చి 4 (ప్రజా మంటలు):** వికసిత్ భారత్ కోసం తమ పార్టీ కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇందుకోసం అనేక కార్యక్రమాలతో ముందుకు పోతున్నామని అన్నారు. ఈ పదిహేను రోజుల్లోనే చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రధాని మోడీ ఈ సందర్భంగా వివరించారు. అభివృద్ధికి తాము ఎంతగా కట్టుబడి ఉన్నామో తెలిపారు. ప్రజలంతా తమ వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగం కావాలని పిలుపుని÷-చారు. ఆదిలాబాద్‌లో భాజపా ఆధ్వర్యంలో నిర్వహించిన 'విజయ సంకల్ప సభ'లో ఆయన మాట్లాడారు. ఇది ఎన్నికల సభ కాదని.. అభివృద్ధి ఉత్సవమని చెప్పారు. 15 రోజుల్లో 5 ఎయిమ్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. ఆదివాసీ మహిళను రాష్ట్రపతిని చేశామన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో భాజపా 400 సీట్లు గెలవాలన్నారు. కాంగ్రెస్, భారాసపై ఈ సందర్భంగా మోదీ పలు విమర్శలు చేశారు.'భారాస ప్రభుత్వం నిర్మించిన కాళేశ్వరం కుంగింది. ఈ విషయంలో ఆ పార్టీతో కాంగ్రెస్ కుమ్మక్కవుతోంది. గతంలో మీరు తిన్నారు.. ఇప్పుడు మేం తింటాం అన్నట్లు కాంగ్రెస్ పరిస్థితి ఉందని విమర్శలు చేశారు. ఈ అవినీతిపై విచారణలో కాంగ్రెస్ చిత్తశుద్ధితో ముందుకు సాగడం లేదన్నరు. భారాస పోయి కాంగ్రెస్ వచ్చినా పాలనలో ఎలాంటి మార్పు రాలేదు. రాష్ట్రంలో సమ్మక్క-సారక్క పేరుతో గిరిజన విశ్వవిద్యాలయాన్ని స్థాపించాం. 140 కోట్ల మంది ప్రజలే నా కుటుంబం. ప్రజల కలల సాకారం కోసం నేను పనిచేస్తా. మోదీ గ్యారంటీ అంటే.. కచ్చితంగా అమలయ్యే గ్యారంటీ. దేశంలో 7 మెగా టెక్స్‌టైల్ పార్కులు ఏర్పాటు చేయబోతున్నాం. అందులో ఒకటి తెలంగాణలో పెడతాం అని మోదీ అన్నారు. ఈ సందర్భంగా మోదీ కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్‌ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ తన ప్రసంగాన్ని ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ... పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో కూడా వచ్చే మార్పు ఏమీ ఉండబోదని పెదవి విరించారు. రెండు పార్టీల విధానం ఒక్కటేనని విమర్శించారు. కుటుంబ పాలనలో ఒకటి దోచుకోవడం రెండు అబద్దాలు వ్యాప్తి చేయడమే వారి విధానాలు అని విమర్శలు చేశారు. కాళేశ్వరంలో అవినీతి జరిగిందని విమర్శలు చేసిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏం చేస్తోందని ప్రశ్నించారు మోదీ. కుటుంబ పాలనలో ఉన్న పార్టీలన్నీ ఒక్కటవుతాయని వారిని నమ్మొద్దని ప్రజలకు మోదీ సూచించారు. బీజేపీ మాత్రమే దేశాభివృద్ధి లక్ష్యంతో పాలన చేస్తుందని తెలిపారు. ప్రస్తుతం తాను చేస్తున్న పర్యటనలు ఎన్నికలకు సంబంధం లేదన్న మోదీ... తాను వికసిత్ భారత్‌లో భాగమవ్వాలని ప్రజలను కోరేందుకే వస్తున్నట్టు ప్రకటించారు. పదేళ్ల బీజేపీ పాలనలో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వాటిలో చాలా ప్రాజెక్టులు తెలంగాణకు కేటాయించినట్టు వివరించారు మోదీ. రెండు ఐఐటీలు, ఓ ట్రిపుల్ ఐటీ, ఒక ఐఐఎం, ఎయిమ్స్ ఇవాళ ప్రారంభించిన మరికొన్ని ప్రాజెక్టులు అన్నింటిని కూడా ప్రజలకు తెలిపారు. ఆదిలాబాద్‌కు చాలా చరిత్ర ఉందని ఎందరో స్ఫూర్తినిచ్చే నేతలు ఉన్నారని అన్నారు మోదీ. ఇలాంటి ప్రాంతం నుంచే ముర్ము అనే మహిళ రాష్ట్రపతి అయ్యారని తెలిపారు. తెలంగాణలోని గిరిజన నేతల్లో కూడా పేరున్న వాళ్లు ఉన్నారని వివరించారు. రాంజీ గోండు పేరుతో హైదరాబాద్‌లో మ్యూజియం ఏర్పాటు చేస్తున్నామని... సమ్మక్క సారలమ్మ ట్రైబల్ యూనివర్సిటీ, పసుపు బోర్డు ఇలా చాలా విషయాల్లో తెలంగాణకు తోడ్పాటు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపిలు సోయం బాపూరావు, బండి సంజయ్, అర్వింద్, ఈటెల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అమలు చేయాలి

దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసి మార్చి 31లోగా క్రమబద్ధీకరణ ప్రక్రియను ముగించాలని ఆయా శాఖలకు ఆదేశాలు జారీ చేసింది. ప్రజల నుంచి ఎలాంటి చార్జీలు లేకుండా ఎల్ ఆర్ ఎస్ కార్యక్రమం ద్వారా ప్లాట్ల రెగ్యులరైజేషన్ చేయాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి రేవంత్ తో సహా ఉప ముఖ్యమంత్రి, మంత్రులు అందరు కూడా ఎల్‌ఆర్‌ఎస్ రద్దు చేస్తామని, ప్రజల దగ్గర ఎలాంటి చార్జీలు వసూలు చేయకుండానే రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీకి కట్టుబడి ఉండాలని కేటీఆర్ అన్నారు. గత ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ కోసం మార్గదర్శకాలు రూపొందించినప్పుడు, ఇదే కాంగ్రెస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడిన విషయాన్ని కేటీఆర్ సాక్షాలతో సహా మీడియా ముందు ఉంచారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాల మీద మార్చి 31వ తేదీ లోపల ఎల్‌ఆర్‌ఎస్ డబ్బులు కట్టాలని దరఖాస్తుదారులకు నేరుగా ఫోన్ కాల్స్ చేయడం జరుగుతుందని, మరీ ఇది రాష్ట్ర ప్రజల రక్తాన్ని తాగడం కాదా అన్నారు. అప్పుడు ఉచితంగా క్రమబద్ధీకరిస్తామని తెలిపిన ఉత్తంకుమార్ రెడ్డి, ఈరోజు ప్రభుత్వం అడ్డగోలుగా రాష్ట్ర ప్రజల దగ్గర ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో డబ్బులు లాక్కోవడం పైన స్పందించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో గెలవడం కోసం అడ్డగోలుగా ఇచ్చిన హామీల అన్నింటిని తూ.చా తప్పకుండా అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎల్‌ఆర్‌ఎస్ కార్యక్రమంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న 25 లక్షల 44 వేలమంది లబ్దిదారుల పైన కనీసం లక్ష రూపాయల చొప్పున భారాన్ని మోపేందుకు ఈ ప్రభుత్వం సిద్ధమైందన్నారు. మొత్తం రాష్ట్ర ప్రజల నుంచి ఈ ఎల్‌ఆర్‌ఎస్ ద్వారా 20వేల కోట్ల రూపాయలను దోచుకునేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సిద్ధమైందని విమర్శించారు. అధికారంలో లేనప్పుడు ఒక తీరుగా అధికారంలో ఉన్నప్పుడు మరొక తీరుగా మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు, మంత్రుల వైఖరి పైన కేటీఆర్ తీవ్రంగా మండిపడ్డారు. నిరసన కార్యక్రమాల అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా ఎల్‌ఆర్‌ఎస్ ను అమలు చేయాలని కోరుతూ ప్రతి జిల్లా కలెక్టర్ కి, అర్డీవోలకు ఒక విజ్ఞాపన పత్రాన్ని కూడా అందిస్తామని కేటీఆర్ తెలిపారు. హైదరాబాద్ నగరంలో ప్రత్యేకంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్మెంట్ అథారిటీ హెచ్‌ఎండిఏ) కార్యాలయం ముందు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్‌ఎంసి) కార్యాలయం ముందు ప్రత్యేక నిరసన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఇచ్చిన హామీ మేరకు ఎల్‌ఆర్‌ఎస్ కార్యక్రమంలో ఎలాంటి చార్జీలు వసూలు చేయబోమని ప్రకటించాలని, లేకుంటే భవిష్యత్తులో న్యాయస్థానాలను కూడా ఆశ్రయిస్తామని కేటీఆర్ హెచ్చరించారు.

## లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించిన కేసీఆర్..

**హైదరాబాద్, మార్చి 4 (ప్రజా మంటలు):** త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల కోసం బీఆర్‌ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు అభ్యర్థులను ప్రకటించారు. తొలి జాబితాలో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ఖరారు చేశారు. కరీంనగర్‌కు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లికి మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, ఖమ్మంకు ప్రస్తుత నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ స్థానానికి ఎంపి మాలోత్ కవిత పేర్లను ప్రకటించారు. ఆది, సోమవారాల్లో నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలకు చెందిన నేతలతో బీఆర్‌ఎస్ అధినేత వరుస సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్‌సభ ఎన్నికలపై నేతలతో చర్చించి.. అభ్యర్థుల ఎంపికపై అభిప్రాయాలను సేకరించారు. ఈ క్రమంలో ముఖ్యనేతల అభిప్రాయం మేరకు.. సమష్టి నిర్ణయంతో తొలి విడుదతలో నలుగురు అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికల బరిలో నిలువబోతున్న అభ్యర్థులకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తొలుత మానుకోటకు సంబంధించి పలు పేర్లను పరిశీలించారు. చివరకు కవిత పేరునే ఖరారు చేశారు. ఈ సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, హరీశ్‌రావు, ఎంపీలు కేశవరావు, నామా నాగేశ్వరరావు, కవిత పాల్గొన్నారు. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు సమావేశానికి హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో రెండు రోజులుగా ఆయా పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని ముఖ్యనేతలతో కేసీఆర్ కీలక అంశాలపై చర్చించారు. అభ్యర్థులను ప్రకటించిన అనంతరం కేసీఆర్ మీడియాతో మాట్లాడారు. కరీంనగర్ తర్వాత ఖమ్మంలో కూడా సభ పెడతాం. త్వరలోనే ఖమ్మంలో భారీ బహిరంగ సభ ఉంటుంది. జిల్లాలో పార్టీ ఓడిపోయిందని ఎవరూ అధైర్యపడొద్దు. పార్టీ వీడి వెళ్లే నేతలతో బీఆర్‌ఎస్‌కు ఎలాంటి నష్టం లేదు. రాబోయే కాలం మనదే. నేతలు కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థులను గెలిపించుకోవాలి. ఒక్కో నియోజకవర్గానికి ముగ్గురు సమన్వయకర్తలను నియమిస్తాం. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ లాంటి నేతకు రాజకీయాల్లో ఒడిదుడుకులు తప్పలేదు. మనమెంత మనకూ గెలుపు, ఓటమిలు వస్తాయి. కాంగ్రెస్ పార్టీపై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత మొదలయింది. కాంగ్రెస్ వ్యతిరేకతను మనం సద్వినియోగం చేసుకోవాలి. కాంగ్రెస్ ప్రభుత్వానికి పాలనపై అవగాహన రావడం లేదని కేసీఆర్ పేర్కొన్నారు.

## కేంద్రంతో సఖ్యత ముఖ్యం: రాజాసింగ్

**హైదరాబాద్, మార్చి 4 (ప్రజా మంటలు):** కేంద్రంతో మంచి సంబంధాలు ఉంటేనే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. సోమవారం నాడు బీజేపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... మాజీ సీఎం కేసీఆర్ మాదిరిగా సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరించవద్దని హితవు పలికారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మెదట కేసీఆర్ పొగడ్తలతో ముంచెత్తారని.. ఆ తర్వాత కనీసం ప్రోటోకాల్ పాటించలేదని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ మాదిరిగా మారకూడదని సూచించారు. కేంద్రంతో సఖ్యతగా ఉంటేనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని తెలిపారు. పదేళ్ల కాలంలో తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఎన్ని నిధులు ఇచ్చిందో ప్రజలకు రేవంత్ తెలియజేయాలని అన్నారు. బీఆర్‌ఎస్ నేతలు చేసిన అవినీతిని కూడా ప్రజల ముందు పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీని పెద్దన్న అని సీఎం రేవంత్ సంబోధించటం శుభపరిణామమని రాజాసింగ్ అన్నారు.

## విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దం

### సిఎం రేవంత్ రెడ్డి

అన్నారు. గురుకుల టీచర్లుగా నియామకాలు అందుకున్న వారు తమ ఉద్యోగం కోసం అని కాకుండా సామాజిక బాధ్యతగా పౌరులను తీర్చిదిద్దే పని చేపట్టాలన్నారు. తెలంగాణ తులసివనంలో ఒక్క గంజాయివనం కూడా ఉండరాదని కఠినంగా నిర్ణయించామని, విద్యార్థులు గంజాయి మత్తులకు అలవాటు పడకుండా వారిని సక్రమ మార్గంలో పెట్టే బాధ్యత టీచర్లదేనని అన్నారు. మీ చేతుల్లోనే వారి భవిష్యత్ ఆధారపడి వుందన్నారు. ప్రభుత్వ పాఠశాల లోనే చదివి తాను ఈ స్థాయికి ఎదిగానని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎల్బీ స్టేడియంలో లెక్చరర్లు, టీచర్లు ఉద్యోగాలకు ఎంపికైన 5,192 మందికి నియామక పత్రాలను ఆయన అందజేశారు. మూడు నెలల్లోనే 30 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలు ఇచ్చామని పేర్కొన్నారు. ఎల్బీ స్టేడియం లోనే రైతును రాజుగా చేసే పాలనకు నాంది పడిందని చెప్పారు. తెలంగాణ సాధనలో నిరుద్యోగులు, యువత పాత్ర ఎంతో గొప్పది. వారి త్యాగాలు, బలిదానాలతోనే స్వరాష్ట్రం సాకారమైంది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడితే న్యాయం జరుగుతుందని భావించారు. కానీ, కుటుంబ పాలనలో యువత ఆకాంక్షలు నెరవేరలేదు. కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యుల పదవులు ఊడగొడితేనే.. తమకు ఉద్యోగాలు వస్తాయని యువత భావించారు. అనుకున్నట్టే చేయడంతో.. ఇప్పుడు ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. ఈ ప్రభుత్వం ప్రజాప్రభుత్వంమని నిరూపించామని, ఇకముందు మరింతగా వెళ్లేందుకు తమకు ఆశీర్వదిం చాలని అన్నారు. నాకు ఇంగ్లిష్ రాదని కొందరు అవహేళన చేస్తున్నారు. నేను జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు మీడియంలో చదివా. గుంటూరు, గుడివాడకు వెళ్లి కార్పొరేట్ పాఠశాలల్లో చదవలేదు. వేలాది గురుకులాలు నిర్మించామని గత పాలకులు గొప్పగా చెబుతున్నారు. ఎక్కడా వాటికి శాశ్వత భవనాలు నిర్మించలేదు. వసతులు లేని అ÷-దదె భవనాల్లో పేద విద్యార్థులు అవస్థలు పడ్డారు. రేషనైలేజేషన్ పేరిట కేసీఆర్ 6 వేల పాఠశాలలను మూసివేశారు. కులవృతుల వారి పిల్లలు ఆ పనులే చేసుకోవాలని భావించారు. పేదలు గొర్రెలు, బర్రెలు, చేపలు మాత్రమే పెంచాలనట్టుగా వ్యవహరించారు. ఆయన మనవడి పెంపుడు కుక్క చనిపోతే వెటర్నరీ డాక్టర్ మీద కేసీఆర్ కేసు పెట్టారని విమర్శించారు. అయితే ఉద్యోగాలు రాక ఆత్మహత్య చేసుకున్న వారు ఎన్ని కేసులు పెట్టాలో చెప్పాలన్నారు. నూతనంగా నియమించిన 5,192 మంది లెక్చరర్లు, టీచర్లు, కానిస్టేబుల్, మెడికల్ సిబ్బందికి ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను రేవంత్ రెడ్డి అందజేశారు. నేను కూడా ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నా. నేను ఈ రోజు రాష్ట్ర ముఖ్యమంత్రి అయ్యానంటే నాడు ప్రభుత్వ పాఠశాలలో అందించిన విద్యనే కారణం. నేను గుంటూరులోనో, గుడివాడ లోనో చదువుకోలేదు.. గుంటూరులోనో, గుంటూరు మరెక్కడో చదువుకున్న కొందరు నాకు ఇంగ్లీష్ రాదని అవహేళన చేస్తున్నారు. చైనా, జపాన్, జర్మనీలో వారికి ఇంగ్లిష్ రాదు. కానీ ప్రపంచంతోనే పోటీపడే అభివృద్ధి, ఉత్పత్తులను ఆయా దేశాలు అందిస్తున్నాయి. ఇంగ్లీష్ అనేది ఓ భాష, ప్రపంచంలో ఉద్యోగం, ఉపాధికి ఉపయోగపడుతుంది. మా రోజుల్లో నాడు ఉన్న అవకాశాలను పట్టి మేం నేర్చినంత చదువులు నేర్చుకున్నాం. నేడు ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు వచ్చే ఇంగ్లీషును నేర్పండి. మీ దగ్గర చదువుకునే పిల్లలకు ఇంగ్లిష్ రాదని అవహేళన చేసే పరిస్థితి రావద్దు. మీ దగ్గర చదువుకునే పిల్లలకు మంచి భాషను, భావాన్ని దేశభక్తిని నేర్పండి. వారే రేపటి పాలకులు అవుతారు. రాష్ట్రంలో గురుకుల పాఠశాలలు ఇచ్చామని గత పాలకులు చెబుతున్నారు. వాటిలో ఎక్కడైనా మౌలిక వసతులు కల్పించారా? అందుకే మోడల్ గురుకుల పాఠశాల తీసుకురావాలని రూ.25 ఎకరాల్లో కొడంగల్ నియోజకవర్గంలో రూ.150 కోట్లతో ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాన్ని ఏర్పాటు చేస్తున్నాం' అని రేవంత్ రెడ్డి తెలిపారు. తెలంగాణ నిరుద్యోగులకు మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలిచ్చా మన్నారు సీఎం రేవంత్ రెడ్డి. ఎల్బీ స్టేడియంలో ఉద్యోగ నియామకపత్రాలు అందించే కార్యక్రమం జరుగుతోంది. ఇక్కడి నుంచే ఇందిరమ్మ పాలనకు శ్రీకారం చుట్టామన్నారు. ఎల్బీ స్టేడియం వేదికగా ఉద్యోగ నియామక పత్రాలు అందిస్తున్నామన్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం పెద్ద ఎత్తున ఉద్యోగాల జాతర నిర్వహిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో దాదాపు 25 వేల మందికి ఉద్యోగ నియామక పత్రాలను ఇప్పటివరకు అందించారని చెప్పారు. గతంలో సంవత్సరాల తరబడి ఉద్యోగాల కోసం కొట్లాడేవారు.. ఇప్పుడు ప్రతి వారం ఏదో ఒక ఉద్యోగ నియామకాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా.. ఇచ్చిన హామీలను నెరవేరుస్తామని ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాలు సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వం పై తప్పుడు ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. బీఆర్‌ఎస్ పదేళ్లపాటు గ్రూప్ 1 కి సంబంధించి ఒక్క నోటిఫికేషన్ ఇవ్వలేదని మండిపడ్డారు. కానీ కాంగ్రెస్ వచ్చిన మూడు నెలల్లోనే గ్రూప్ 1 నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చిందన్నారు. నిరుద్యోగులకి నోటిఫికేషన్లు ఇవ్వడంతోపాటు.. ఉచితంగా ఎగ్జామ్స్ లో ప్రిపేర్ అవ్వటానికి ప్రతి నియోజకవర్గంలో నాలెడ్జ్ సెంటర్ల ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సంక్షేమం మా లక్ష్యం

**మహిళలకు అండగా అనేక పథకాలు**

**మంత్రి సీతక్క వెల్లడి**



హైదరాబాద్, మార్చి 4 (ప్రజా మంటలు): తెలంగాణ ప్రభుత్వం మహిళల కోసం చేపట్టిన పలు అభివృద్ధి, సంక్షేమ, సంరక్షణ పథకాలు అద్భుతంగా అమలవుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాలకు కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. ఉచిత బస్సు, 500కే గ్యాస్ పథకం, గృహజ్యోతి కింది 200 యూనిట్ల ఉచిత విద్యుత్ మహిళలకు భరోసాగా మారిందని మంత్రి సీతక్క అన్నారు. మహిళా రక్షణతో పాటు, వారి కోసం చేపట్టిన వివిధకార్యక్రమాలపై అవగాహనా కార్యక్రమాలను చేపట్టనున్నారు. ఈసారి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలని అధికార భావిస్తోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవ సంబరాల్లో భాగంగా పారిశుద్ధ్య కార్మికులు, డాక్టర్లు, ఆశా వర్కర్లు, ఎఎన్ఎంలు, స్వయం సహాయక సంఘాల నాయకురాళ్లతో పాటు ప్రతిభ కలిగిన విద్యార్థినిలు, తదితర మహిళలకు గౌరవపూర్వక సన్మానం నిర్వహించాలని అనుకుంటున్నారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్‌లతో పాటు ఇతర సంక్షేమ పథకాల లబ్దిదారులంతా ప్రబుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నారు. 8న నియోజకవర్గ స్థాయిలో మహిళలతో సమావేశాలు నిర్వహించి, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించనున్నారు. ఇప్పటికే ఆర్టీసీలో ఉచిత ప్రయాణంలో మహిళలు ఆనందంగా ఉన్నారు. గ్యాస్ , గృహజ్యోతి పథకంతో మరింత ఆదరణ దక్కింది. క్షేత్రస్థాయి సమస్యలకు పరిష్కారం ఇస్తున్న గొప్ప పాలకుడు మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. క్షేత్రస్థాయి సమస్యలకు అద్భుతమైన పరిష్కారం చూపిస్తూ అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమా లను రూప కల్పన చేశారని కొని యాడారు. అందులో భాగంగానే మహిళా సంక్షేమానికి సంబంధించి అపూర్వమైన కార్యక్రమా లను తమ ప్రభుత్వం చేపట్టిందన్నారు. కేంద్రం బేటీ బచావో బేటీ పడావో అంటూ కేవలం నినాదాలు ఇస్తున్న సమయంలో నిజంగా విద్యార్థులను చదివించి, సంరక్షిస్తున్న ప్రభుత్వం మనదే అని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల లోనూ మహిళల కోసం అనేక కార్యక్రమా లను చేపట్టామని తెలిపారు. కేంద్రం గ్యాస్ ధరలు పెంచడంతో మహిళలకు భారంగా మారడంతో 500కే సిలిండర్ ఇస్తున్నామని సీతక్క అన్నారు. ఎన్నికలయ్యాక ధరలతో మోదడం మోడీకి అలవాటుగా మారిందన్నారు. బండి సంజయ్ ఇతర నేతలు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఏ ఒక్కటి లేదన్నారు. బీజేపీ నాయకులు మతాల మధ్య చిచ్చు పెట్టి రాజకీయ లబ్ది పొందాలని చూస్తుందన్నారు. మనకు విద్వేషాలు, కొట్లాటలు ముఖ్యం కాదు. గలగల పారే గోదావరి జలాలు కావాలన్నారు. స్వల్పకాలంలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ అభివృద్ధిలో ముందుకు వెళుతోందని అన్నారు. గ్రామాలలో బిఆర్ఎస్ అరచకాలపై చర్చలు పెట్టి నాయకులను ఎక్కడిక్కడే నిలదీయాలని మంత్రి పిలుపునిచ్చారు.

# ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

**11న భద్రాద్రిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం - సిఎం రేవంత్ చేతుల మీదుగా ప్రారంభం**



ఖమ్మం,మార్చి4 (ప్రజా మంటలు): పేదవాడికి తోడు నీడగా ఉండాలనేదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. విద్యా, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. త్వరలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రి రాములవారి సన్నిధిలో ప్రారంభి స్తారని మంత్రి పొంగులేటి తెలిపారు. సోమవారం నాడు సత్తుపల్లిలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ... ప్రజలు ఆశించిన మేరకు పరిపాలన సాగిస్తున్నామని చెప్పారు. సింగరేణి ప్రభావిత ప్రజలను సింగరేణి అధికారులు ఆదుకోవాలని చెప్పారు. రెవిన్యూ సెక్టార్‌లో అవినీతికి పాల్పడకుండా అధికారులు పనిచేయాలని సూచించారు. టీఎస్పీఎస్సీ ద్వారా పారదర్శకంగా నియామకాలు చేపడతామని అన్నారు. ఇప్పటికే సుమారు 22 వేల ఉద్యోగాల ఇచ్చామని చెప్పారు. మెగా డీఎస్సీని ప్రకటించామని.. 11 వేల ఉద్యోగ నియామకాలను పార్లమెంట్ ఎన్నికల కోడ్‌కు ముందుగానే చేపడతామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పద్ధతులు మానుకోవాలని.. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలకు మంచిచేసేలా అధికారులు ముందుకు వెళ్లాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి అప్లికేషన్లను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేలా మండల స్థాయిలో అధికారులతో కమిటీ ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఓ వైపు అభివృద్ధి పథకాలతో ముందుకు సాగుతుంటే బిఆర్ఎస్ తన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు అడ్డుపుల్లలు వేస్తోందని , బీఆర్ఎస్ వైఖరిని ప్రజలు అసహ్యించుకుంటున్నారని.. పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క ఎంపీ సీటును గెలవనీయబోమని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హెచ్చరించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించి తీరుతామని.. ఇది దొరల ప్రభుత్వం కాదు.. ఇందిరమ్మ రాజ్యం అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో గత ప్రభుత్వ దోపిడీ, దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేశామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారెంటీల్లో 4 హామీలను అమల్లోకి తీసుకువచ్చామని తెలిపారు. మహిళలకు మహాలక్ష్మి హామీలో భాగంగా ఉచిత బస్సు, రూ.10 లక్షల మెడికల్ బీమా, రూ.500 గ్యాస్, రూ.200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని అన్నారు. మూడు నెలల్లో 25 వేల ఉద్యోగాలు, మెగా డీఎస్సీకి నోటిఫికేషన్ వేశామని చెప్పారు. 2 లక్షల ఉద్యోగాలు ఇచ్చి తీరుతాం, పేపర్ లీకేజీలు లేని పరీక్షలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వాల వైఫల్యాలపై శ్వేతపత్రాల్లో అసెంబ్లీ సాక్షిగా గత ప్రభుత్వ అవినీతిని బహిరంగ పరిచామని అన్నారు. తాము కాళేశ్వరం వెళ్తే కేసీఆర్ దుర్భాషలాడారని.. ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు ఎందుకు వెళున్నారని ప్రశ్నించారు. ప్రజలకు నిత్యం సీఎం సహా ప్రతి మంత్రి అందుబాటులో ఉంటామని అన్నారు.

# కారు బీభత్సం..

**వేగంగా వచ్చి చెట్టును ఢీకొన్న కారు**

**ముగ్గురు చిన్నారులతో పాటు ఐదుగురు మృతి**

ఇదే కారులో ప్రయాణం సాగిస్తున్న మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద ఘటన తెలిసిన వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సహాయ సహకారాలను అందించారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రులకు తరలించారు. తీవ్రంగా గాయపడిన వారిలో ముగ్గురు పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ ప్రమాదానికి నిద్ర మత్తు, అతివేగమే కారణంగా తెలుస్తోంది. పోలీసులు కూడా ప్రాథమికంగా ఇదే నిర్ధారించారు. బళ్లారి నుంచి హైదరాబాదుకు వస్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు ధ్రువీకరించారు. కారును నడుపుతున్న వ్యక్తి అత్యంత వేగంగా నడపడంతోపాటు నిద్రమత్తు వల్ల చెట్టును ఢీ కొట్టినట్లు పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. ఈ ఘటనలో మృతి చెందిన వారిలో వాసి (1), బుష్రా (2), మరియా (4), ఫాతిమా (50), అబ్దుల్ రెహమాన్ (30) గా గుర్తించారు. ఈ ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కావడంతో క్షతగాత్రులను, మృతదేహాలను బయటకు తీసేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించారు. ప్రమాదానికి గురైన వ్యక్తిగా ఎర్టిగా కారులో 13 మంది ప్రయాణిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. గతంలోనూ ఈ మార్గంలో ఉదయం 2.30 నుంచి ఐదు గంటల మధ్య అనేక ప్రమాదాలు జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు. ఇకపోతే వనపర్తి ఆసుపత్రిలో చేర్చిన ఎనిమిది మందిలోనూ కొందరు పరిస్థితి ఇబ్బందికరంగా ఉంది. మృతి చెందిన వారి స్వస్థలం ఇతర వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు వాటికి సంబంధించిన సమాచారాన్ని సేకరించే పనిలో ఉన్నారు.



వేలేర్ మండలం మల్లికుదుర్ల గ్రామంలో శివరాత్రి సందర్భంగా శ్రీ గట్టు మల్లికార్జున స్వామి దేవస్థానం వద్ద జాతర బందోబస్తు ఏర్పాట్ల పర్యవేక్షించిన కాజిపేట్ ఎసిపి తిరుమల్. పాల్గొన్న ధర్మసాగర్ సీఐ మహేందర్, వేలేర్ ఎస్సై హరిత

# అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్న ఎస్సై ఏ. అనిల్



ఇబ్రహీంపట్నం మార్చ్ 04 (ప్రజామంటలు): మండల పరిధిలోని కోమటి కొండపూర్ లో సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కోమటి కొండాపూర్ గ్రామానికి చెందిన నల్ల శ్రీనివాస్ రెడ్డి మరియు ఏనుగు మోహన్ రెడ్డి లు కోమట కొండపూర్ శివారులో గల గోదావరి నుండి అక్రమంగా ఇసుకను తమ ట్రాక్టర్లలో తరలిస్తుండగా పట్టుకొని పోలీస్ స్టేషన్కు కి తీసుకొని వచ్చి వారిపై కేసు నమోదు చేయడం జరిగింది అని ఎస్సై ఏ. అనిల్ తెలిపారు.



# క్యానర్సర్ బారిన పడ్డ ఇస్రో చైర్మన్

**స్వయంగా వెల్లడించిన సోమానాథ్**



బెంగలూరు, మార్చి 4 (ప్రజా మంటలు): భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చీఫ్ సోమనాథ్ క్యాన్సర్ బారినపడ్డారు. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా వెల్లడించారు. సూర్యుడిని అధ్యయనం చేసేందుకు రూపొందించిన 'ఆదిత్య ఎల్ 1 ప్రయోగం చేపట్టిన రోజే వ్యాధి నిర్ధరణ అయినట్లు తెలిపారు. ఓ మలయాళం వెబ్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం పూర్తిగా కోలుకున్నట్లు చెప్పారు. 'చంద్రయాన్-3 ప్రయోగం సమయంలోనే ఆరోగ్య సమస్యలు వచ్చాయి. ఆ సమయంలో దాని గురించి నాకు స్పష్టమైన అవగాహన లేదు. కానీ, ఆదిత్య-ఎల్1 మిషన్ ప్రయోగించిన ఉదయమే వైద్య పరీక్షలు చేయించుకున్నా. కొద్ది సమస్య ఉన్నట్లు గుర్తించారు. ప్రయోగం ముగిసిన తర్వాత చెన్నై వెళ్లి మరిన్ని స్కాన్‌లు చేయించాను. అప్పుడే నాకు అర్థమైంది. నా కడుపులో కణితి పెరిగిందని. మరో రెండు, మూడు రోజుల తర్వాత నిర్ధరణ అయ్యింది. అది వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి' అని ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడించారు. ఈ విషయం తెలిసిన వెంటనే కుటుంబసభ్యులతో పాటు సహోద్యోగులు షాక్‌కు గురయ్యారన్నారు. 'సెప్టెంబర్ 2, 2023న ఆదిత్య ఎల్1 ప్రయోగం చేపట్టిన తర్వాత ఆపరేషన్ చేయించుకోవాలని వైద్యులు సూచించారు. అనంతరం శస్త్రచికిత్సతోపాటు కీమోథెరపీ కూడా చేయించుకున్నా. అలా అవన్నీ భరించాల్సి వచ్చింది. అయితే, మొత్తంగా నాలుగు రోజులే ఆసుపత్రిలో ఉన్నా. ఐదోరోజు నుంచి ఇస్రోలో రోజూవారీ బాధ్యతల్లో నిమగ్నమయ్యా. తొలుత కాస్త కంగారు పడినప్పటికీ క్యాన్సర్‌కు పూర్తి పరిష్కారంగా చికిత్స ఉందన్న విషయంపై ఇప్పుడు పూర్తి అవగాహన వచ్చింది' అని ఇస్రో చీఫ్ పేర్కొన్నారు.

# పనిమనిషే కిడ్నాపర్

**చేరిన రెండ్రోజులకే చిన్నారి అపహరణ**

**సిసి ఫుటేజ్ ఆధారంగా గంట్లో పట్టుకున్న పోలీసులు**

హైదరాబాద్,మార్చ్ 04 (ప్రజామంటలు): పనిమనిషిగా ఇంట్లో చేరిన రెండు రోజులకే 9 నెలల చిన్నారిని ఎత్తుకెళ్లిందో రాక్షసి. తల్లిదండ్రులు గమనించి.. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు... సీసీ ఫుటేజ్ ఆధారంగా... కొన్ని గంటల్లోనే కేసును ఛేదించారు. జహీరాబాద్‌లో నిందితురాలని పట్టుకున్నారు. చిన్నారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. చిన్నారి దొరకడంతో అటు పేరంట్స్, ఇటు పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. కాస్త ఆలస్యమయితే... నిందితురాలు... తప్పించుకునేదని పోలీసులు అన్నారు. హైదరాబాద్ పాతబస్తీలోని మాదన్నపేటలో జరిగిందీ కిడ్నాప్. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన షహనాజ్‌ఖాన్ అనే మహిళ... చిన్నారి ఇంట్లో రెండు రోజుల క్రితమే పనికి కుదిరింది. చిన్నారి ఆరోగ్యం సరిగాలేకపోవడంతో... చంచల్‌గూడలోని నర్సింగ్ హోమ్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆ సమయంలోనే... చిన్నారి కిడ్నాప్ అయ్యింది. ఇంట్లో పని ముగించుకుని... ఆస్పత్రికి వచ్చిన షహనాజ్‌ఖాన్ ఎవరికీ తెలియకుండా పాపను ఎత్తుకెళ్లింది. చిన్నారి కనిపించకపోవడంతో... వెంటనే పోలీసులను ఆశ్రయించారు తల్లిదండ్రులు. సమీపంలోని సీసీ కెమరాలను పరిశీలించిన పోలీసులు... షహనాజ్‌ఖాన్ పాపను కిడ్నాప్ చేసినట్టు గుర్తించారు. ఆమె అక్కడి నుంచి ఎక్కడెక్కడికి వెళ్లిందని.. సీసీ ఫుటేజ్‌ను పరిశీలించారు. హైదరాబాద్ ఎంజీబీఎస్‌లో జహీరాబాద్ బస్సు ఎక్కినట్టు గుర్తించారు. వెంటనే జహీరాబాద్ పోలీసులను అప్రమత్తం చేశారు... మాదన్నపేట పోలీసులు. జహీరాబాద్ పోలీసులు వెంటనే... బస్టాండ్ దగ్గరకు చేరుకుని వేచి చూశారు. షహనాజ్‌ఖాన్ ఎక్కిన బస్సు కోసం ఎదురుచూశారు. ఆ బస్సు రాగానే అప్రమత్త మయ్యారు. చిన్నారితోపాటు బస్సు దిగిన షహనాజ్‌ఖాన్‌ను వెంటనే అదుపులోకి తీసుకున్నారు. చిన్నారిని క్షేమంగా తల్లిదండ్రులకు అప్పగించారు. కిడ్నాప్ జరిగిన కొన్ని గంటల్లోనే పోలీసులు కేసును ఛేదించారు. చిన్నారిని సేఫ్‌గా పేరంట్స్‌కు అప్పగించారు. నిందితురాలు షహనాజ్‌ఖాన్... ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మహిళగా గుర్తించారు. అయితే... ఆమె చిన్నారిని ఎందుకు కిడ్నాప్ చేసింది...? ఎక్కడికి తీసుకెళ్లాలని అనుకుంది...? ఆమె వెనుక కిడ్నాప్ ముఠా ఉందా..? అన్న కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు . చిన్నారి క్షేమంగా తమ చెంతకు చేరడంతో తల్లిదండ్రులు సంతోషపడుతున్నారు. పాప కిడ్నాప్ అయినట్టు వెంటనే గుర్తించడం... త్వరత్వరగా దర్యాప్తు జరగడంతో నిందితురాలిని పట్టుకోగలిగారు. చిన్నారులను కిడ్నాప్ చేసి... వారిని చిత్రహింసలు పెట్టి దివ్యాంగులుగా మారుస్తున్న ఘటన వెలుగుచూసింది. పిల్లలను దివ్యాంగులుగా మార్చి.. వారితో బెగ్గింగ్ చేయిస్తోంది ఈ ముఠా. ఈ మధ్య కాలంలో పిల్లల కిడ్నాప్‌లు ఎక్కువవుతున్నాయని... చిన్న పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా చూసుకోవాలని సూచిస్తున్నారు పోలీసులు. గుర్తు తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు.

# తెల్లం కాంగ్రెస్‌లో చేరడం ఖాయమేనా

**సిఎంతో భేటీపై ఊహాగానాలు**



హైదరాబాద్,మార్చ్ 04 (ప్రజామంటలు): బీఆర్ఎస్ కు చెందిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఇలా ఆయన సీఎంను కలవడం ఇది రెండోసారి. తాజాగా కుటుంబసభ్యులతో సహా వెళ్లి సీఎం రేవంత్ రెడ్డిని కలిశారు. వారితో పాటు మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కూడా ఉన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలంటూ ఓ వినతిపత్రాన్ని రేవంత్ రెడ్డికి తెల్లం వెంకట్రావు అందజేశారు. గతంలో గులాబీ పార్టీలోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. కానీ, కాంగ్రెస్‌లో ఆయనకు సీటు దక్కలేదు. అనంతరం బీఆర్ఎస్‌లో చేరి టికెట్ దక్కించుకొని గెలిచారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 10 అసెంబ్లీ నియోకవర్గాలు ఉండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది.కొంతకాలంగా ఈ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ లో చేరబోతున్నారని ప్రచారం జరుగుతోంది. తాజాగా సీఎం రేవంత్ రెడ్డిని రెండోసారి కలవడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశం అయింది. పార్లమెంటు ఎన్నికల వేళ అధికార కాంగ్రెస్ పార్టీలోకి ఇప్పటికే ఇతర పార్టీల నుంచి చేరికలు ప్రారంభం అయ్యాయి. తాజాగా అందుకే తెల్లం వెంకట్రావు కూడా హైదరాబాద్‌లో సీఎంను కలిసి చర్చలు జరిపినట్లు భావిస్తున్నారు.

# మైలార్‌దేవ్‌పల్లిలో దారుణం బండరాయితో మోది భార్య హతం

రంగారెడ్డి, మార్చ్ 04 (ప్రజామంటలు): మైలార్‌దేవ్‌పల్లిలో దారుణం చోటు చేసుకుంది. బండరాయి తలపై మోది భార్యను దారుణంగా ఓ కసాయి భర్త హతమార్చాడు. అమృత్ సాహు, కవిత దంపతులు గత కొంతకాలంగా మైలార్‌దేవ్‌పల్లిలో జీవిస్తున్నారు. భార్య కవితపై అనుమానం పెంచుకున్న అమృత్ సాహు.. ఆమె నిద్రిస్తుండగా... తలపై బండరాయితో కొట్టాడు. దీంతో కవిత అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. కవిత వేరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుందని అనుమానంతోనే ఈ హత్య చేసినట్టు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు స్పాట్‌కు చేరుకుని అమృత్ సాహుని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

# మేడిగడ్డపై హైకోర్టు విచారణ

**జ్యుడిషయల్ విచారణ కోరిన ప్రభుత్వం**

హైదరాబాద్,మార్చ్ 04 (ప్రజామంటలు): మేడిగడ్డ బ్యారేజ్ వ్యవహారంపై హైకోర్ట్ లో సోమవారం విచారణ జరిగింది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడంపై ప్రభుత్వం జుడిషియల్ విచారణ కోరిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు లేదా హైకోర్టు రిటైర్డ్ జడ్జ్ తో విచారణ జరిపించాలని ప్రభుత్వం కోరింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఇప్పటికే విజిలెన్స్ ఎంక్వయిరీకి ఆదేశించినట్టు ప్రభుత్వం తెలిపింది. విజిలెన్స్ రిపోర్ట్ తర్వాత ఇంజనీర్లను విధుల నుండి తొలగించినట్లు కోర్టుకు ప్రభుత్వం తెలిపింది. మేడిగడ్డ బ్యారేజ్ కుంగడానికి కారణమైన అధికారులపై ÷నైల్ రిపోర్ట్ వచ్చాక చర్యలు తీసుకుంటున్నామని వివరించింది. ఈ ఘటనపై ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం నేషనల్ డ్యామ్స్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాసింది. డ్యాం సేఫ్టీ అథారిటీ ఆరుగురు సభ్యుల తో కూడిన కమిటీని ఏర్పాటు చేసింది. సెంట్రల్ వాటర్ కమిషన్ ను ఇంప్లీడ్ చేయాలని పిటిషనర్ కు హై కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ 4 వారాలకు తెలంగాణ హైకోర్టు వాయిదా వేసింది.కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల డిజైన్ల నిర్మాణాన్ని పరిశీలించేందుకు నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నిపుణుల కమిటీని ఆదివారం (మార్చి 3) నియమించింది. కేంద్ర జల సంఘం మాజీ ఛైర్మన్ జె.చంద్రశేఖర్ అయ్యర్ సారథ్యంలో అయిదుగురు సభ్యులతో కమిటీని నియమించింది. ఇందులో యూసీ విద్యార్థి, ఆర్.పాటిల్, శివకుమార్ శర్మ, రాహుల్ కుమార్ సింగ్ సభ్యులుగా ఉన్నారు. ఎన్డీఎస్ఏ డైరెక్టర్ (టెక్నికల్) అమితాబ్ మీనా ఈ కమిటీకి మెంబర్ సెక్రెటరీగా వ్యవహరిస్తారు. మేడిగడ్డ బ్యారేజీలోని ఫియర్లు కుంగిపోవటంతో అప్రమత్తమైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం. సుందిళ్ల బ్యారేజీలపై సమగ్రంగా విచారణ జరపాలని ఫిబ్రవరి 13న నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీకి లేఖ రాసింది. మూడు బ్యారేజీల డిజైన్లతో పాటు నిర్మాణాలను నిపుణుల అధ్వర్యంలో అన్ని కోణాల్లో పరిశీలించాలని ఎన్డీఎస్ఏ విజ్ఞప్తి చేసింది. స్పందించిన నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఈ మూడు బ్యారేజీలపై కమిటీని నియమిస్తూ మార్చి 2వ తేదీ శనివారం రోజున ఉత్తర్వులు జారీ చేసింది. బ్యారేజీలను పరిశీలించి, కుంగుబాటుకు, పగుళ్లకు కారణాలను విశ్లేషించాలని, ఇప్పుడున్న పరిస్థితుల్లో చేపట్టాల్సిన ప్రత్యామ్నాయాలను సిఫారసు చేయాలని ఈ కమిటీకి సూచించింది. నాలుగు నెలల్లోపు తమ రిపోర్టును అందజేయాలని కమిటీకి నిర్ణీత గడువును విధించింది.

## నాగర్‌కర్నూలోలో పోటీ చేస్తా: మల్లురవి

హైదరాబాద్,మార్చ్ 04 (ప్రజామంటలు): నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేస్తున్నానని మాజీ ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు. దీనికి కాంగ్రెస్ అధిష్టానం కూడా అనుకూలంగా ఉందని అన్నారు. తాను పోటీచేయడం ఖాయమని, గెలవడం కూడా ఖాయమని అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... నాగర్ కర్నూల్ నుంచి పోటీలో మల్లు రవి ఉంటారని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టంగా చెప్పారన్నారు. 'టికెట్ నాకే ఇస్తానని సీఎం స్పష్టంగా చెప్పారు. నాగర్ కర్నూల్ టికెట్ నాకే ఇస్తారని నమ్మకంగా ఉన్నాను. సర్వేలన్నింటిలో నేనే ముందున్నాను' అని ఆయన అన్నారు. బీఆర్ఎస్ - బీఎస్పీ మధ్య చర్చలు జరుగుతున్నాయన్నారు. హిందూ మత మూల సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీ పని చేస్తోందని విమర్శించారు. బీజేపీ హిందూ మతానికి వ్యతిరేకంగా పని చేస్తోందన్నారు. బీఆర్ఎస్, బీజేపీ, బీఎస్పీ అవగాహనతో పని చేస్తున్నాయన్నారు. గత ప్రభుత్వంలో లాగా తమ ప్రభుత్వంలో పాలాభిషేకాలు లేవన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోతామనే పారిపోతున్నారని మల్లు రవిం ఎద్దేవా చేశారు.

## ప్రజాశాంతి పార్టీలో చేరిన బాబూమోహన్ వరంగల్ నుంచి పోటీ చేస్తానని ప్రకటన

వరంగల్,మార్చ్ 04 (ప్రజామంటలు): ప్రముఖ నటుడు, మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే బాబు మోహన్ కెఏ పాల్ సార్థ్యంలోని ప్రజా శాంతి పార్టీలో చేరారు. సోమవారం పార్టీ చీఫ్ కేఏపాల్ సమక్షంలో బాబుమోహన్ పార్టీ కండువా కప్పుకున్నారు. కొద్ది రోజుల క్రితం బీజేపీకి గుడ్‌బై చెప్పిన మాజీ మంత్రి.. సోమవారం ప్రజాశాంతి పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో బాబు మోహన్ మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ప్రజాశాంతి పార్టీ తరపున వరంగల్ నుంచి బరిలోకి దిగనున్నట్లు ప్రకటించారు. త్వరలోనే ప్రచారం ప్రారంభించి కచ్చితంగా విజయం సాధిస్తామని బాబు మోహన్ ధీమా వ్యక్తం చేశారు.గత నెలలో బీజేపీకి బాబుమోహన్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా బీజేపీ నాయకత్వం పై ఆయన తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు కూడా. తనను వాడుకుని బీజేపీ పొమ్మనలేక పొగ పెడ్తోందని ఆరోపణలు చేశారు. ఆందోల్ నియోజకవర్గం నుంచి 2018, 2023లో బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా బాబుమోహన్ పోటీ చేశారు. అయితే వరంగల్ ఎంపీ టికెట్‌ను మాజీ మంత్రి ఆశించారు. కానీ.. వరంగల్ టికెట్ బాబుమోహన్‌కు ఇచ్చేందుకు కమలంపార్టీ నిరాకరించింది. దీంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ బీజేపీకి బాబు మోహన్ గుడ్‌బై చెప్పేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆందోల్ టికెట్‌ను బాబుమోహన్ కుమారుడు ఉదయ్ మోహన్‌కు ఇవ్వాలని బీజేపీ భావించింది. అయితే తమ కుటుంబంలో బీజేపీ చిచ్చు పెడుతోందని మాజీ మంత్రి ఆరోపించారు.

## అమెరికాలో మళ్లీ కాల్పులు

**నలుగురు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు**

కాలిఫోర్నియా,మార్చ్ 04 (ప్రజామంటలు): అగ్రరాజ్యం అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం రేపుతున్నాయి. కాలిఫోర్నియాలో పబ్లిక్‌గా జరుపుకుంటున్న వేడుకపై గుర్తుతెలియని వ్యక్తులు జరిపిన కాల్పుల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. సెంట్రల్ కాలిఫోర్నియాలోని కింగ్ సిటీలో ఏర్పాటు చేసిన ఓ అవుట్‌డోర్ పార్టీకి పలువురు హాజరయ్యారు. అంతలోనే ముసుగులు ధరించి.. కారులో అక్కడికి చేరుకున్న ముగ్గురు దుండగులు ఒక్కసారిగా కాల్పులకు తెగబడ్డారు. ఈ దాడిలో ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన నలుగురిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. ఇదిలా ఉంటే కాల్పుల అనంతరం దుండగులు అదే కారులో పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలిస్తున్నారు.

## కాంగ్రెస్‌కు మరో షాక్.. అర్జున్ మోద్వాడియా రాజీనామా

పోర్‌బందర్,మార్చ్ 04 (ప్రజామంటలు): సార్వత్రిక ఎన్నికల ముందు కాంగ్రెస్‌కు వరుస దెబ్బలు తగులుతున్నాయి. మరికొద్ది రోజుల్లోనే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుంది. కానీ ఇంతలోనే ఆ పార్టీ ముఖ్య నేతలు పార్టీని వీడడం కలవరపెడుతోంది. ఇప్పటికే మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మనవడు విభాకర్ శాస్త్రితో సహా పలువురు నేతలు హస్తానికి గుడ్‌బై చెప్పారు. తాజాగా అదే కోవలోకి మరొక కీలక నేత వచ్చి చేరారు. గుజరాత్ కాంగ్రెస్ సీనియర్ నేత అర్జున్ మోద్వాడియా ఆ పార్టీకి రాజీనామా చేశారు. అంతేకాకుండా తన ఎమ్మెల్యే పదవికి సైతం రాజీనామా చేస్తూ గుజరాత్ అసెంబ్లీ స్పీకర్‌కు రాజీనామా లేఖను అందచేశారు. పార్టీ నుంచి వైదొలగుతున్నానని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు ఆయన లేఖ పంపారు. దీంతో నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్‌తో ఉన్న బంధం తెగిపోయింది. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో మోద్వాదియా పోర్‌బందర్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.వ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తూ ఖర్గేకు లేఖ పంపించారు. అయోధ్యలో రాముడి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి కాంగ్రెస్ హాజరుకాకపోవడం బాధ కల్గించిందని తెలిపారు. ఆహ్వానాన్ని తిరస్కరించడం దేశ ప్రజల మనోభావాలు దెబ్బతీశాయని చెప్పుకొచ్చారు. ప్రజల మనోభావాలను అంచనా వేయడంలో కాంగ్రెస్ విఫలమైందని ఆరోపించారు. ఈ పవిత్ర సందర్భం నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు రాహుల్‌గాంధీ అసోంలో రచ్చ సృష్టించేందుకు ప్రయత్నించారని విమర్శించారు. ఇది భారత పౌరులను, కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను మరింత దెబ్బతీశాయని లేఖలో మోద్వాడియా

## గొర్రెల పథకం గోల్‌మాల్‌పై ఆరా దర్యాప్తు వేగవంతం చేసిన ఎసిబి

హైదరాబాద్,మార్చి4మార్చ్ 04 (ప్రజామంటలు): గొర్రెల పథకం నిధుల గోల్‌మాల్‌పై ఏసీబీ దర్యాప్తు వేగవంతం చేసింది. గొర్రెలు, ఆవులు, బర్రెల స్కీంలో ప్రభుత్వ నిధులు దుర్వినియోగమైన విషయం తెలిసిందే. కేసుల నుంచి తప్పించుకోవడానికి ఈ ల్యాబ్‌లో డాక్యుమెంట్స్ ట్యాంపరింగ్ కూడా జరిగినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. పశుసంవర్ధక శాఖలో అధికారులు కాంట్రాక్టర్ మొయినుద్దీన్‌తో కలిసి అవినీతికి పాల్పడ్డట్టు ఏసీబీ నిర్ధారించింది. మొయినుద్దీన్ వెనుక ఉన్న రాజకీయ నాయకుడి పాత్రపై సమాచారం సేకరించినట్లు తెలుస్తోంది. ఆరు భోగస్ కంపెనీల పేరుతో పశుసంవర్ధక శాఖలో మొయినుద్దీన్ కాంట్రాక్ట్ తీసుకున్నాడు. నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చి విచారించనుంది. పశుసంవర్ధక శాఖలో కిందిస్థాయి ఉద్యోగులు సహకరించకుంటే అధికారులు.. వారికి చార్జి మెమోలు ఇచ్చినట్లు, ట్రాన్స్ఫర్లు చేయించినట్లు ఏసీబీ విచారణలో బయటపడింది.

# ఎన్నికలే లక్ష్యంగా బిజెపి ఎత్తులు !



సార్వత్రిక ఎన్నికలకు ముందు జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటి తనకు తిరుగులేదన్న సంకేతాలు ఇచ్చింది. ఈ ఫలితాలు సార్వత్రిక ఎన్నికలపై పెద్దా ప్రభావం చూపవని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే లాంటి వారు కొట్టి పారేసినా.. ప్రజల్లో నాటుకున్న భావనలను మాత్రం తోసిపుచ్చలేం. తాజా పరిస్థితులు, బిజెపి వేస్తున్న అడుగులు మరోమారు విజయంపై ధీమాలో కమలనాథులు ఉన్నారు.
బీజేపీకి జాతీయ స్థాయిలో మరింత బలాన్ని ఇచ్చింది. అలాగే రేపు జరగగబోయే వివిధ రాష్ట్రాల ఎన్నికలతో పాటు, సార్వత్రిక ఎన్నికలు కూడా బూస్ట్ కానుంది. తెలంగాణ లాంటి రాష్ట్రాల్లో మున్ముందు మేలు చేస్తుందనే భావన ఉంది. ఈశాన్య రాష్ట్రాల ఫలితాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేయలేక పోయినా.. దేశంలో అంతటా బిజెపికి బలం ఉందని చెప్పుకోవడానికి పనికి వస్తుంది. చిన్న రాష్ట్రాలనైనా గుప్పిట పెట్టుకోవాల్సిందే అన్నది బిజెపి రాజకీయం. దేశ రాజకీయాలు ప్రధానంగా ఉత్తర భారతదేశం చుట్టూనే తిరుగుతూ ఉంటాయి. కాబట్టే ఇటు ఈశాన్య రాష్ట్రాలను జాతీయ పార్టీలు పెద్దగా పట్టించుకోలేదు. అక్కడ లోక్‌సభ స్థానాలు కూడా చాలా తక్కువ కావడం అందుకు మరో కారణం. కానీ బిజెపి వచ్చాక ఈ చిన్న రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలన్న లక్ష్యంతో పనిచేసింది. ఈ క్రమంలోనే తెలంగాణలో కూడా పాగా వేయాలన్న పట్టుదలతో పనిచేసి 8 అసెంబ్లీ సీట్లను సాధించింది. అందుకే తెలంగాణపై వచ్చే ఎంపి ఎన్నికల కోసం ప్రత్యేక దృష్టి సారించింది. ప్రధాని మోడీ ఇక్కడ అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిం చడంలో ఔచిత్యం కూడా ఇదే. ఎపిలోనూ పాగా వేయకున్నా బలపడాలన్న పట్టుదలతో ఉంది. ఇక లిక్కర్ స్కామ్‌లో దూకుడు వెనక ఎమ్మెల్సీ కవితను కూడా ఇరుకున పెట్టే ప్రయత్నాలు సాగుతున్నాయి. అటు ఎపిలోనూ ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయుడిని చేర్చడం ద్వారా అక్కడా రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నాల్లో బిజెపి ఉంది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో సౌత్ గ్రూప్‌నకు డిప్యూటి సీఎం మనీష్ సిసోడియా సహకరించారని, సౌత్ గ్రూపులో కవిత కూడా ఉందని ఈడీ, సీబీఐలు చార్జ్ షీట్స్ కూడా దాఖలు చేశాయి. సిసోడియా ఆఫీసులోనే కొత్త మద్యం పాలసీ డ్రాఫ్ట్ తయారైందని సీబీఐకి పక్కా ఎవిడెన్స్ దొరికినట్లు ప్రచారం జరుగుతోంది. ఒకట్రెండు రోజుల్లో కవిత అరెస్ట్ తప్పదని బీజేపీ వర్గాలు బలంగా వాదిస్తున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్ పొత్తు తప్పకపోవచ్చన్న సంకేతాల కారణంగా దానిని నిర్వీర్యం చేయడం ద్వారా కాంగ్రెస్‌తో తలపడాలిన బీజేపీ యోచిస్తోంది. . కవిత అరెస్ట్ అయితే రాష్ట్రంలో బీజేపీ పుంజుకుంటుందా... బీఆర్ఎస్ అడ్వాంటేజ్ తీసుకుంటుందా, కాంగ్రెస్-బీఆర్ఎస్ కలిస్తే బీజేపీకి ఛాన్స్ ఉంటుందా... అన్నది వేరు విషయం. అయితే ప్రస్తుత సమీకరణాలను మాత్రం బిజెపి బాగా అధ్యయనం చేయడం ద్వారా రానున్న ఎన్నికల నాటికి బలోపేతం కావాలన్న లక్ష్యంతో పనిచేస్తోంది. వీటన్నింటిపై చర్చించేందుకే అమిత్ షా బీజేపీ రాష్ట్ర స్థాయిలో ఉన్న అగ్ర నాయకత్వాన్ని ఢిల్లీ పిలిపించి మాట్లాడినట్లు తెలుస్తోంది. అమిత్ షా రాష్ట్ర రాజకీయాల్లో తరచూ జోక్యం చేసుకుని ఎలా ముందుకు వెళ్లాలో సూచిస్తున్నారు. విచిత్రమేమంటే ఏడు దశాబ్దాల పాలనలో కాంగ్రెస్ అనుసరించిన సంస్కృతిని ప్రధానమంత్రి నరేంద్రమోద, అమిత్ షాలు అమలు చేస్తున్నారు. దర్యాప్తు సంస్థలను గుప్పిట్లో పెట్టుకోవడం, పార్టీల్లో సీనియర్లను పక్కన పెట్టడం, ముఖ్యమంత్రులను మార్చడం తదితర నిర్ణయాలన్నీ గతంలో కాంగ్రెస్ చేసిచూపింది. బిజెపి రాజకీయాల
తీరు కాంగ్రెస్ సంస్కృతికి ఏ మాత్రం భిన్నంగా లేవనడానికి అనేక నిర్ణయాలు ఉదాహరణగా నిలుస్తాయి. ఈ మొత్తం వ్యవహారంలో అధికారమే లక్ష్యంగా మోడీ ద్వయం అడుగులు వేస్తోంది. మన్మోహన్ సింగ్‌ను కీలుబొమ్మ ప్రధానమంత్రిగా అభివర్ణించిన వారే మోడీ హయాంలో ఇప్పుడంతా కీలుబొమ్మలుగా మారారు. మోదీ హయాంలో బిజెపి కూడా కాంగ్రెస్ మాదిరే అధిష్ఠానవర్గాన్ని అత్యంత బలోపేతంగా మార్చి ప్రజలు, వారు ఎన్నుకున్న ప్రజా ప్రతినిధుల అభిప్రాయానికి విలువలేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నది. మోదీ హవా కూడా ఆయన ఆకర్షణ ఓట్లు తేగలిగినంత కాలమే సాగుతుంది. స్థానికంగా బలహీనులైన, కీలుబొమ్మలైన నేతలను ప్రోత్సహిస్తే కేంద్రం బలహీనపడ్డప్పుడు తదనుగుణంగా రాష్ట్రాల స్థాయిలో కూడా బిజెపి కుప్పకూలిపోతుంది. అయితే ఇకముందు ఎలాంటి నిర్ణయాలు తీసుకుంటారన్న దానిపైనే భవిష్యత్ రాజకీయం ఆధారపడి ఉంటుంది. ఇకపోతే ఇటీవలి వరుస ఎన్నికల్లో బిజెపి మరింత బలపడుతుందే తప్ప బలహీనం కావడం లేదు. విపక్షాల్లో అనైక్యతే బిజెపి బలంగా మారింది. ఇండియా కూటమి బలహీనతపైనే జాతీయ రాజకీయాల్లో ఇప్పుడు ఇదే చర్చ సాగుతోంది. జాతీయ స్థాయిలో బీజేపీకి వ్యతిరేకంగా కూటమి ఏర్పాటు ప్రయత్నాలు బలపడడం లేదు. అంతా కాంగ్రెస్ చుట్టే తిరుగుతున్నాయి. బీజేపీకి వ్యతిరేకంగా గళం వినిపిస్తున్న పార్టీలు ఒక్క తాటిపైకి రావడానికి కసరత్తు కూడా పెద్దగా జరగడం లేదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న పార్టీలన్నీ కూడా అవకాశం కోసం చూస్తున్నాయి. బిజెపిని నిలువరించాలని అనుకుంటున్న శక్తులను కూడగట్టాలని కాంగ్రెస్ నేత రాహుల్ చూస్తున్నారు. అన్ని ప్రాంతీయ పార్టీలు జట్టుగా బీజేపీపై రాజకీయ పోరాటం కోసం ఎజెండా సిద్ధం చేసే కసరత్తు చేస్తే తప్ప ఫలితం ఉండదు. బిజెపిని వ్యతిరేకిస్తున్న ప్రాంతీయ పార్టీలు లెక్కలు వేస్తున్నాయి. ప్రాంతీయ పార్టీల కూటమి ఏర్పాటుపై మరింత వేగం పెంచే అవకాశం కోసం చూస్తున్నాయి.



### చట్టసభ సభ్యుల అవినీతిపై

## సుప్రీం తీర్పు

**వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెరుగుతుందన్న మోడీ**

**ఎక్స్ వేదికగా తీర్పును స్వాగతించిన ప్రధాని**

**న్యూఢిల్లీ, మార్చి 4 (ప్రజామంటలు):**
చట్టసభ సభ్యుల అవినీతిపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును దేశ ప్రధాని నరేంద్ర మోదీ స్వాగతించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్‌ఖాతాలో స్పందించారు. 'గౌరవ సుప్రీం కోర్టు అద్భుతమైన తీర్పును ఇచ్చింది. అది భవిష్యత్తులో స్వచ్ఛమైన రాజకీయాలకు కారణమై.. వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతుంది' అని అభిప్రాయపడ్డారు. ఈ పోస్టుకు సుప్రీం తీర్పునకు సంబంధించిన కథనాన్ని జత చేశారు. లంచం కేసుల్లో ఎంపీ, ఎమ్మెల్యేలకు ఎలాంటి మినహాయింపు ఇవ్వకూడదని నేడు సుప్రీం కోర్టు తేల్చి చెప్పింది. చట్టసభల్లో ప్రశ్నలు అడిగేందుకు, ప్రసంగించేందుకు, ఓట్లు వేసేందుకు లంచం తీసుకుంటే రక్షణ కల్పించలేమని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు వెలువరించింది. ఎంపీలు, ఎమ్మెల్యేల లంచాల కేసులో సర్వోన్నత న్యాయస్థానం.. సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. లంచం కేసులో చట్టసభల సభ్యులకు మినహాయింపు లేదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ప్రశ్నలకైనా, ఓటుకైనా డబ్బులు తీసుకుంటే విచారణ ఎదుర్కోవాల్సిందేనని తీర్పును వెలువరించింది. ఏకగ్రీవ తీర్పు చెప్పిన ఏడుగురు సభ్యుల ధర్మాసనం.. చట్టసభల్లో ప్రశ్నలకు డబ్బులు తీసుకుంటే.. ప్రజాప్రతినిధులు విచారణ నుంచి తప్పించుకోలేరని పేర్కొంది. 1998లో ఇదే కేసులో ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఇచ్చిన.. తీర్పును కొట్టేస్తూ సుప్రీం బెంచ్ తీర్పును వెలువరించింది. సీతా సోరెన్ వర్సెస్ కేంద్రప్రభుత్వం కేసులో సుప్రీంకోర్టు ఈ తీర్పును వెల్లడించింది. పీవీ నరసింహారావు కేసులో 1998 నాటి సుప్రీంకోర్టు తీర్పును, సోమవారం ధర్మాసనం కొట్టేసింది.. చట్టసభల్లో సభ్యులు డబ్బులు తీసుకున్నా, విచారణకు మినహాయింపు ఉంటుందని అప్పట్లో సుప్రీంకోర్టు తన తీర్పులో తెలిపింది. రాజ్యాంగంలోని 105(2), 194 (2) ఆర్టికల్స్ ప్రకారం చట్టసభ సభ్యులకు ప్రివిలేజ్ విషయంపై సుప్రీంకోర్టు ఇవాళ భాష్యం చెప్పింది. పార్లమెంటులో ఓటింగ్ కోసం లంచం తీసుకున్నందుకు ఎంపీలు/ఎమ్మెల్యేలకు ప్రాసిక్యూషన్ నుంచి మినహాయింపునిస్తూ 1998లో ఇచ్చిన తీర్పును బెంచ్ ఏకగ్రీవంగా తిరస్కరించింది. పీవీ నరసింహారావు కేసులో తీర్పుతో విభేదిస్తున్నామని సుప్రీంకోర్టు తెలిపింది. ఎంపీలు, ఎమ్మెల్యేల అవినీతి, లంచాలు భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ పనితీరును నాశనం చేస్తాయని సుప్రీంకోర్టు పేర్కొంది. సుప్రీంకోర్టు పేర్కొన్న పివి నరసింహ కేసు జార్ఖండ్ ముక్తి మోర్చా లంచాల కుంభకోణానికి సంబంధించినది. 1993లో జేఎంఎం సభ్యులు లంచం తీసుకోని.. కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతు తెలపడం దేశ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించింది. సిపిఐ(ఎం) ఎంపీలు నర్సింహరావు ప్రభుత్వంపై అవిశ్వాస తీర్మానం పెట్టగా.. నగదు తీసుకుని జేఎంఎం ఎంపీలు ప్రభుత్వానికి మద్దతు తెలిపారంటూ అభియోగాలు మోపారు.

## శ్రీశైలంలో వైభవంగా శివరాత్రి ఉత్సవాలు

**శ్రీశైలం, మార్చి 4 (ప్రజామంటలు):**
శ్రీశైలం మల్లికార్జున స్వామివారి పుణ్యక్షేత్రంలో శివరాత్రి మహోత్సవాలు వైభవంగా జరగుతున్నాయి. ఉత్సవాలను తిలకించేందుకు తెలుగు రాష్ట్రాలతోపాటు కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. సోమవారం నల్లమల అడవుల నుంచి భారీ సంఖ్యలో భక్తులు కాలినడకన శ్రీశైలానికి చేరుకుంటున్నారు. నాగులూటి నుంచి పెద్దచెరువు, భీమునికొలను, కైలాస ద్వారం లాంటి దట్టమైన అటవీ ప్రాంతాల నుంచి భక్తులు పాదయాత్ర చేసుకుంటూ శ్రీశైలానికి వేలాదిగా తరలివస్తున్నారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఇవాళ రాత్రి 7 గంటలకు స్వామి అమ్మవార్లకు మయూర వాహన సేవ, గ్రామోత్సవం నిర్వహించనున్నారు.

# లంచం కేసుల్లో ఎంపిలు, ఎమ్మెల్యేలకు షాక్

**ఎవరు అవినీతికి పాల్పడ్డా విచారణకు అర్హులే**

**వారికి ఎలాంటి మినహాయింపు లేదు**

**సంచలన తీర్పు వెలువరించిన సుప్రీం ధర్మాసనం**




**న్యూఢిల్లీ, మార్చి 4 (ప్రజామంటలు):**
సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. లంచం కేసుల్లో ఎంపీ, ఎమ్మెల్యేలకు రాజ్యాంగ రక్షణ,మినహాయింపు లేదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు ఇచ్చింది. పార్లమెంటు, శాసనసభల్లో ఎవరైనా సభ్యులు అవినీతికి పాల్పడితే వారిని విచారించే విషయంపై భారత సర్వోన్నత న్యాయస్థానం సోమవారం కీలక తీర్పు వెలువరించింది. లంచం కేసుల్లో ఎంపీ, ఎమ్మెల్యేలకు ఎలాంటి మినహాయింపు లేదని తేల్చి చెప్పింది. చట్టసభల్లో ప్రశ్నలు అడిగేందుకు, ప్రసంగించేందుకు, ఓట్లు వేసేందుకు లంచం తీసుకుంటే రక్షణ కల్పించలేమని ఏడుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏకగ్రీవంగా తీర్పు వెలువరించింది. ఈ మేరకు 1998 నాటి తీర్పును న్యాయస్థానం కొట్టేసింది. ఝార్ఖండ్ ముక్తి మోర్చా అవినీతి కేసు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. 2012లో రాజ్యసభ ఎన్నికల్లో ఆ పార్టీ శాసనసభ్యురాలు సీతా సోరెన్ ఒక పార్టీ అభ్యర్థికి ఓటు వేయడానికి లంచం పుచ్చుకుని మరొకరికి ఓటు వేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ క్రిమినల్ కేసును కొట్టివేయాలని కోరుతూ ఆమె తొలుత ఝార్ఖండ్ హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు తిరస్కరించడంతో సీతా సోరెన్ సుప్రీంకు వెళ్లారు. దీనిపై 2019లో అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణ జరిపింది. ఎంపీలు, ఎమ్మెల్యేలు చట్టసభల్లో అవినీతికి పాల్పడినప్పుడు వారిపై చర్యలు తీసుకోవచ్చా లేదా వారికి రక్షణ ఉంటుందా అనే అంశం ఎంతో ప్రాముఖ్యమైనదని తెలిపింది. దాన్ని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనానికి సిఫార్సు చేసింది. అనంతరం ఈ కేసును చీఫ్ జస్టిస్ డి.వై. చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల ధర్మాసనం విచారించింది. సభలో చేసే ప్రసంగాలు, అక్కడ వేసే ఓట్లపై ఎంపీలకు రాజ్యాంగపరమైన రక్షణ ఉంటుందని పీవీ నరసింహారావు వర్సెస్ సీబీఐ కేసులో 1998లో ఇచ్చిన తీర్పును పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని తెలిపింది. ఇందుకోసం ఏడుగురు సభ్యుల విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేసింది. తాజాగా విస్తృత ధర్మాసనం విచారణ జరిపి కీలక తీర్పు వెలువరించింది. అవినీతికి పార్లమెంటరీ అధికారాల ద్వారా రక్షణ ఉండదని కోర్టు ఈ సందర్భంగా వెల్లడించింది. 1998లో ఇచ్చిన తీర్పు రాజ్యాంగంలోని 105, 194 అధికరణలకు విరుద్ధంగా ఉందని పేర్కొంది. లంచం తీసుకోవడం అనే ఆరోపణలు ప్రజాజీవితంలో విశ్వసనీయతను దెబ్బతీస్తాయని తెలిపింది. 1993లో అప్పటి ప్రధాని పీవీ నరసింహారావు ప్రభుత్వం అవిశ్వాసాన్ని ఎదుర్కొంది. ఆ సమయంలో జేఎంఎం ఎంపీగా ఉన్న శిబు సోరెన్ సహా ఇదే పార్టీకి చెందిన మరో నలుగురు ఎంపీలు లంచాలు తీసుకుని అవిశ్వాస తీర్మానానికి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు ఆరోపణలు వచ్చాయి. వీరి మద్దతుతో మైనార్టీలో ఉన్నప్పటికీ పీవీ ప్రభుత్వం గట్టెక్కింది. ఆ తర్వాత సోరెన్ సహా ఐదుగురు ఎంపీలపై సీబీఐ కేసు నమోదు చేసింది. ఈ కేసు సుప్రీంకోర్టుకు వెళ్లగా.. సోరెన్ బృందానికి ఊరట లభించింది. ప్రజాప్రతినిధులకు లంచం కేసుల విచారణ నుంచి మినహాయింపు నిస్తూ 1998లో అప్పటి ధర్మాసనం తీర్పు వెలువరించింది. పార్లమెంట్, అసెంబ్లీల్లో ప్రశ్నలకైనా, ఓటుకైనా లంచాలు తీసుకుంటే విచారణ ఎదుర్కోవాల్సిందేనని స్పష్టం చేసింది. 1998లో పీవీ నరసింహారావు కేసులో ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ తాజాగా సరికొత్త తీర్పు ఇచ్చింది. చట్టసభల సభ్యుడు లంచం
ఇవ్వడం ప్రజాజీవితంలో విశ్వసనీయతను దెబ్బతీస్తుందని, లంచాలు తీసుకోవడం నేరమని ఈ సందర్భంగా సుప్రీం కోర్టు పేర్కొంది. శాసన అధికారాల ఉద్దేశ్యం, లక్ష్యం తప్పనిసరిగా గుర్తుంచుకోవాలని ధర్మాసనం పేర్కొంది. అధికారాలు సమిష్టిగా చట్టసకు ఉంటాయని స్పష్టం చేసింది. ఆర్టికల్ 105/194 సభ్యులకు నిర్భయ వాతావరణాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తోందని తెలిపింది. అవినీతి, శాసనసభ్యుల లంచం భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య పనితీరును నాశనం చేస్తోందని తెలిపింది. రాజ్యసభ ఎన్నికల్లో ఓటు వేయడానికి లంచం తీసుకుంటున్న ఎమ్మెల్యేలు అవినీతి నిరోధక చట్టం కింద కూడా బాధ్యుల వుతారని సుప్రీంకోర్టు తెలిపింది.

# రామేశ్వరం కేసులో ఎన్ఐఎ విచారణ

**బ్రాండ్ బెంగులూరును దెబ్బతీయొద్దన్న సిఎం**

**న్యూఢిల్లీ, మార్చి 4 (ప్రజామంటలు):**
బెంగళూర్ వైట్ ఫీల్డ్‌లో బిజీగా ఉండే రామేశ్వరం కేఫ్ వద్ద ఇటీవల జరిగిన బ్లాస్ట్‌తో ఒక్కసారిగా కలకలం రేగింది. పేలుడు జరిగిన వ్యక్తి కోసం పోలీసు బృందాలు విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. సీసీటీవీ ఫుటేజీలో ఓ వ్యక్తిని గుర్తించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం ఆధారంగా అతనిని గుర్తిస్తామని పోలీసులు ప్రకటించారు. ఐఈడీ బాంబ్ పేలడం, బెంగళూర్ నడిబొడ్డున ఘటన జరగడంతో జాతీయ భద్రతా సంస్థ రంగంలోకి దిగింది. కేంద్ర హోం శాఖ ఆదేశాలతో ఎన్ఐఏ అధికారులు విచారణ ప్రారంభించారు. రామేశ్వరం కేఫ్ పేలుడుపై సర్వత్రా చర్చ జరుగుతోంది. పేలుడు ఘటనను సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ పోలీసులు విచారిస్తున్నారు. పేలుడు ఘటన విచారణను ఎన్ఐఏకు అప్పగించే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తుందని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ఆదివారం నాడు ప్రకటన చేశారు. ఆ వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించింది. పేలుడు ఘటనను ఎన్ఐఏకు ఇస్తూ కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీచేసింది. మార్చి 1వ తేదీ శుక్రవారం నాడు రామేశ్వరం కేఫ్ వద్ద పేలుడు జరిగింది. ఓ వ్యక్తి వచ్చి టిఫిన్ ఆర్డర్ చేశాడు. ఫుడ్ తీసుకొని టేబుల్ వద్దకొచ్చాడు. అక్కడ టిఫిన్, బ్యాగ్ వదిలి వెళ్లాడు. ఆ తర్వాతే పేలుడు జరిగింది. సీసీటీవీ ఫుటేజీ సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొట్టింది.బ్రాండ్ బెంగళూరుని బాంబు బెంగళూరుగా మార్చారని, రామేశ్వరం కేఫ్




బాంబు పేలుడు కేసుని జాతీయ దర్యాప్తు సంస్థకు అప్పగించాలని బీజేపీ చేసిన వ్యాఖ్యలపై సీఎం సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనపై ప్రస్తుతం సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు జరుపుతోందని.. అవసరమైతే ఈ కేసుని ఎన్ఐఏకు అప్పగించే అంశాన్ని తమ ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు. బాంబు పేలుడు లాంటివి చిన్న ఘటనలు కావని.. ఇలాంటి వాటిపై రాజకీయ ప్రేరేపిత ప్రకటనలు చేయడం బీజేపీ మానుకోవాలని గట్టిగా సూచించారు. బ్రాండ్ బెంగళూరుని బాంబు బెంగళూరుగా మార్చారని బీజేపీ చేసిన ఆరోపణలపై సీఎం సిద్ధరామయ్య స్పందిస్తూ.. 'బీజేపీ హయాంలో నాలుగు బాంబు పేలుళ్ల ఘటనలు చోటు చేసుకున్నాయి. మరి దాన్ని ఏమని పిలవాలి? మంగళూరు కుక్కర్ పేలుడు జరిగినప్పుడు ఎవరు అధికారంలో ఉన్నారు? మల్లేశ్వరంలోని బీజేపీ కార్యాలయం ముందే పేలుడు సంభవించినప్పుడు, ఎవరు పాలిస్తున్నారు? అని విరుచుకుపడ్డారు. తాను బాంబు పేలుడు ఘటనకు మద్దతివ్వడడం లేదని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నానని అన్నారు. కానీ.. దీనిపై బీజేపీ రాజకీయాలు చేయడం మానెయ్యాలని ఉద్ఘాటించారు. బాంబు పేలుడు వంటివి సిల్లీ ఘటనలు కావని, ఇలాంటి సంఘటనలపై ప్రభుత్వాలు ఎప్పుడూ సీరియస్‌గానే చర్యలు తీసుకున్నాయని.. ప్రజల భద్రత చాలా ముఖ్యమని ఆయన నొక్కి చెప్పారు. ఇదే సమయంలో.. తన రాజకీయ ప్రయోజనాల కోసం బీజేపీ కర్ణాటక ప్రతిష్టను దిగజార్చిందని డిప్యూటీ సీఎం శివకుమార్ కూడా మండిపడ్డారు. రాజకీయ మైలేజ్ పొందడం కోసం ఈ అంశాన్ని బీజేపీ వాడుకుంటోందని.. ఈ క్రమంలో బెంగళూరుతోపాటు కర్ణాటక ప్రతిష్టను దిగజార్చుతోందని ధ్వజమెత్తారు. బీజేపీ హయాంలో జరిగిన ఘటనల్ని వాళ్లు మరిచిపోయి ఉండొచ్చని, అయితే వాటిపై రాజకీయాలు చేయడం తనకు ఇష్టం లేదని అన్నారు. ఇలాంటి సమయాల్లో వారు దేశ ఐక్యత, సమగ్రత, శాంతి గురించి తెలుసుకోవాలని అన్నారు. బీజేపీ నాయకులకు ప్రాథమిక అవగాహన లేదని.. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వారెవరూ 'బాంబు బెంగళూరు' వంటి మాటలు మాట్లాడరని కౌంటర్ ఇచ్చారు.

## భక్తులకు అండగా భగవంతుడు!

భగవంతుడు ఎల్లవేళలా తనయందు భక్తి కలిగిన వారికి ఏదో రూపంలో అండగా ఉంటూనే ఉంటారు. శరణాగతి కోరుకుంటే అభయం ఇస్తుంటాడు. భక్తితో తనను శరణు వేడుకున్న వారికి అండగా ఉంటానని మన పురాణాలు, ఉపనిశత్తులు చెబుతున్నాయి. మనం ఏ రూపంలో భక్తితో కొలిస్తే భగవంతుడు ఆ రూపంలో మనకు సాక్షాత్కరిస్తాడు. మానవుడు తాను కల్పించుకొనే మానవ సంబంధాలనే భగవంతునితో కల్పించు కొని... తద్వారా భగవంతునికి మరింత చేరువ కాగలడు. భగవంతునితో అవిచ్ఛిన్నమైన నిరంతర సాన్నిహిత్యం కలిగిన నాడు మానవుడు నిత్యానంద స్థితిని చేరుకుంటాడు. పురాణాలు, ఇతిహాసాల్లో ప్రహ్లాదాదులంతా ఇలాగే భక్తిని చాటారు. భగవంతుడు వారికి అండగా నిలిచాడు. అంటే భక్తికి భగవంతుడు వశమవుతాడన్నది సత్యం. ప్రతిఫలాపేక్ష లేకుండా తనను కొలువుమని గీతాచార్యుడు చెప్పాడు. ఆధునిక కాలంలోనూ ఇదే పద్ధి కొనసాగుతోంది. గుడికి వెళ్లడం భక్తితో చేయాలని అంటారు. భగవంతుని మీద పరిపూర్ణమయైన ప్రేమ కలిగి ఉండడమే భక్తి. అది అమృతానంద స్వరూపం. త్యాగరూపమైనది అయి ఏ కోర్కెలూ లేని స్థితిలో ఉండాలి. అదే మోక్ష అని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. భగవద్గీతలోని 'భక్తియోగం' భక్తి తత్త్వాన్నీ, లక్షణాల్నీ విపులంగా తెలిపింది. శ్రీమద్భాగవతం భగవద్భక్తుల లక్షణాలను, భక్తి స్వరూపాన్నీ సవిస్తరంగా ఆవిష్కరించింది. మానవునికి క్రోధం, శోకం లాంటి ఎన్నెన్నో అనుభూతులు ఉన్నా ప్రేమ లాంటి మధురమైన అనుభూతి మరేదీ లేదు! ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం. మానవునికి స్వతహాగా ప్రేమించే లక్షణం ఉన్నా... ఆ ప్రేమ ఒక వ్యక్తికో, ఒక వస్తువుకో మాత్రమే పరిమితమవుతుంది. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ, స్వార్థభావంతో కలుషితమౌతూ, విచ్ఛిన్నమై పోతూ ఉంటుంది. దీనినుంచి బయటపడి ప్రేమతత్వాన్ని అలవర్చుకుంటే భగవంతుడు వశమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. నిష్కామంగా ప్రేమించడాన్ని సాధన చెయ్యాలి. ఈ జగత్తులో భగవంతుడు సర్వవ్యాప్తి. సమష్టి రూపమైన భగవంతుని పట్ల... సాధకులు చేసే 'నిష్కామప్రేమ' అనే ఈ ఉపాసనాక్రమానికి కూడా 'భక్తి' అనేదే వ్యవహార నామం. భక్తి సార్వజనీనం, భేదరహితం కావడంవల్ల నిజమైన భక్తిలో లోపాలు ఉండవు. అనంతమైన భగవత్తత్త్వానికి అనంతమైన కళ్యాణ గుణాలు, రూపాలు, నామాలు ఉన్నాయి! వాటిలో రాముడు, కృష్ణుడు, శివుడు, లలిత తదితర సంపూర్ణ దేవతామూర్తుల్ని ఉపాసనా సౌలభ్యం కోసం వేద, పురాణాలు మనకు అందించాయి. భక్తులు తమకు ఇష్టమైన ఒక దేవతా మూర్తిని స్వీకరించి, సమస్త దేవతలనూ, సమస్త జగత్తునూ ఆ మూర్తిలోనే ఉన్నట్టు భావించి, పరదేవతగా ఉపాసించడం ద్వారా భక్తిని కలిగి ఉండాలి. మనసు మరే ఇతర విషయాల మీద, ఇతర దేవతా రూపాల మీద కాకుండా... ఆ ఇష్టదేవతామూర్తి పైనే నిరంతరం లగ్నం కావాలి. భగవంతుడు అనేక విభూతులలో, అనేక కార్యాలు చేస్తూ, వేర్వేరు పేర్లతో, వేర్వేరు రూపాలతో, వేర్వేరు తత్త్వాలుగా కనిపిస్తాడు.

## అర్హులైన పేదలకు త్వరలో
# ఇందిరమ్మ ఇండ్లను ఇస్తాం
### జిల్లా ఇంచార్జీ మంత్రి పొన్నం ప్రభాకర్
### బన్సీలాల్ పేటలో అంగన్ వాడీ భవనం ప్రారంభం



**సికింద్రాబాద్ మార్చి 04 (ప్రజామంటలు) :** అర్హులైన పేదలకు త్వరలో ఇందిరమ్మ ఇండ్లను అందచేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సోమవారం బన్సీలాల్ పేట డివిజన్ గొల్ల కొమురయ్య కాలనీలో నూతనంగా నిర్మించిన అంగన్ వాడీ కేంద్ర భవనాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత రెడ్డి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి లతో కలిసి ప్రారంభించారు, ఈసందర్భంగా అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించి, వసతులు, సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న స్థానిక బస్తీ మహిళలతో మంత్రి అప్యాయంగా పలకరిస్తూ, మాట్లాడారు. ఉచిత బస్సుల్లో ప్రయాణిస్తున్నారా..అని అడిగారు.స్వంత ఇండ్ల కోసం మహిళలు మంత్రిని అడగ్గా, స్పందించిన మంత్రి త్వరలో అర్హత కలిగిన పేదలకు తప్పకుండా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని హామినిచ్చారు. షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘ 2024%--%డైరీని మంత్రి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, జిల్లా సంక్షేమ అధికారి అక్కేశ్వర్ రావు, సీడీపీవో సునంద, స్థానిక బస్తీ నాయకులు ఎం. కృష్ణ, నర్సింగ్ రావు, డి. సుదర్శన్ బాబు లు పాల్గొన్నారు.

## సొసైటీలో ప్రతి ఒక్కరు బాధ్యతగా ఉండాలి
### చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి - బాధ్యత సినిమా టీజర్ విడుదల



**సికింద్రాబాద్ మార్చి 04 (ప్రజామంటలు):** నేటి ఆధునిక సమాజంలో ప్రతి ఒక్కరు తమ, తమ పరిధిలో న్యాయంగా, బాధ్యతగా వ్యవహరిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని, చిన్నారులతో పాటు పెద్ద వాళ్ళ వరకు రెస్పాన్సిబిలిటీని మరవకూడదని చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి సూచించారు. సీకేఎస్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ పై సినీ కొరియో గ్రాఫర్ సి.కుమార్ మొట్టమొదటిసారిగా దర్శకత్వంలో, స్వీయ నిర్మాణంలో నిర్మించిన బాధ్యత సినిమా టీజర్ ను ఆయన పద్మారావునగర్ స్వరాజ్ ప్రెస్ ఆడిటోరియంలో విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ...సైబర్ క్రైమ్ ల పట్ల అంతా అప్రమత్తంగా ఉండాలని, ఏ సంస్థ కూడ ఓటీపీ లు అడగవని, ఈ విషయం ప్రతి ఒక్కరు గుర్తు పెట్టుకోవాలన్నారు. చిన్నారుల భవిష్యత్ ను దృష్టిలో పెట్టుకొని నిర్మించిన బాధ్యత సినిమా విజయవంతం కావాలని ఏసీపీ ఆకాంక్షించారు. ఈసందర్భంగా ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్ పై ప్రత్యేకంగా రూపొందించిన ఆరు టీజర్లను ప్రదర్శించారు. స్కూల్ స్టూడెంట్స్ ఈసందర్భంగా ప్రదర్శించిన డ్యాన్సు అందరిని ఆకట్టుకున్నాయి. ముఖ్య అతిథులుగా చిలకలగూడ ఏసీపీ జైపాల్ రెడ్డి, ఎస్బీఐ బ్యాంకు చీఫ్ మేనేజర్ కామేశ్వరీ, నటీనటులు సుధా జైన్, విశ్వజ, కిరణ్, సాక్షి శ్రీనివాస్, మాటలు,పాటలు సమకూర్చిన రచయిత బోయిన భాస్కర్, మ్యూజిక్ డైరెక్టర్ విష్ణు కిషోర్, సాంకేతికత సిబ్బంది, సినీ అభిమానులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి చిత్రాన్ని నిర్మించిన డైరెక్టర్, నిర్మాత సీ. కుమార్ ను పలువురు అభినందించారు. సినిమాలోని నటులకు, సాంకేతిక సిబ్బందికి సన్మానించి, మెమొంటోలను అందచేశారు. బాధ్యత సినిమా షూటింగ్ పార్ట్ పూర్తయిందని, త్వరలో సినిమాను థియేటర్లలో రాష్ట్ర వ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు డైరెక్టర్ సి. కుమార్ తెలిపారు.

## డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి అర్హత సాధించిన సిహెచ్. సాయి శిల్ప



**మెట్ పల్లి మార్చి 04 (ప్రజామంటలు):** గురుకులం రిక్రూట్మెంట్లో మెట్ పల్లి పట్టణం 9వ వార్డులో ఉంటున్న రాష్ట్ర స్థాయిలో మెరిట్ లిస్టులో రెండో స్థానం నిలిచి డిగ్రీ లెక్చరర్ ఉద్యోగానికి అర్హత సాధించిన సిహెచ్ సాయి శిల్ప ను పట్టణంలోని పలువురు అభినందిస్తున్నారు. గతంలో కూడా ఎస్జీటీ ఇంగ్లీష్ మీడియం అండ్ తెలుగు మీడియంలో మరియు ఆర్మీ పబ్లిక్ స్కూల్లో పిఆర్టి గా అలాగే క్యూస్ హ్యాండ్ క్యూట్ పీజీ ఇంగ్లీషులో కూడా రాష్ట్రస్థాయి మొదటి రెండవ స్థానాలు సాధించారు.

## 44 సం.ల అనంతరం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం
### గుర్తు చేసుకున్న ఆనాటి జ్ఞాపకాలు



**భీమదేవరపల్లి మార్చి 04 (ప్రజామంటలు):** మండలంలో ముల్కనూర్ హైస్కూల్లో 1980-81 సంవత్సరంలో పదవ తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు 44 సం.ల అనంతరం ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. ఆత్మీయ సమ్మేళనంలో 44 ఏండ్ల తరువాత ఆనాటి విద్యార్థులు పాల్గొని వారు చదువుతున్న విద్యార్థి దశ నాటి కాలంలోని తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు కరుణాకర్, అలిగిరెడ్డి రాజిరెడ్డి, మహమ్మద్ రషీద్, మాడుగుల బాబు, అందె రాజయ్య, బెల్లపు రాజయ్య, సిక ప్రభాకర్, వేల్పుల జాన్, దాస్యపు రమేష్, సత్యం, మంతెన మురళీధర్, అస్మత్, నీరంజని, భారతి, మాడుగుల పోచయ్య, నాగుల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## 40 శాతం ఫిట్మెంట్ మంజూరు చేయాలి
### పి.ఆర్.సి. కమిషన్ కు ప్రతిపాదనలు సమర్పించిన టిఆర్టిఎఫ్



**జగిత్యాల మార్చి 04 (ప్రజామంటలు):** ఉద్యోగ ఉపాధ్యా య పెన్షనర్లకు 40 శాతం ఫిట్మెంట్ సిఫారస్ చేయాలని టిఆర్టిఎఫ్ ప్రతిపాదించింది. హైదరాబాదులోని బూర్గుల రామకృష్ణారావు భవనంలో పిఆర్సి కమిషన్ చైర్మన్ శివశంకర్ ని కలిసి ప్రతిపాదనలు సమర్పించారు. ఐదు రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరణ జరిగిందని మన రాష్ట్రంలో కూడా పాత పెన్షన్ పునరుద్ధరణకు సిఫారసు చేయాలని వారు కమిషన్ కోరారు. గురుకులాలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్ టైం ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు మినిమం పే స్కేలు నగదు రహిత వైద్య చికిత్స కోసం సిఫారచాలని కోరారు. గ్రాట్యుటీ 40 లక్షలకు పెంచాలని, ఆటోమేటిక్ అడ్వాన్స్మెంట్ స్కీమ్ స్కేళ్లను 5/10/15/20/25 ఏళ్లుగా మారుస్తూ (ఏస్ పిపి %శ్రీశ్రీ% బి) ఎస్ పిపిటుబి 25 సంవత్సరాలకు అమలు చేయాలని వారు కోరారు. సంఘ ప్రతిపాదనలు సమర్పించిన వారిలో టిఆర్టిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు మానేటి ప్రతాప రెడ్డి రాష్ట్ర అధ్యక్షులు కటకం రమేష్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కావలి అశోక్ కుమార్, సబ్ కమిటీ సభ్యులు రామ్ రెడ్డి, సమత, రాజూనాయక్, కుషాల్, షద్రక్, రాఘవేందర్ లు పాల్గొన్నారు.

## ఎన్.హెచ్. 63 జాతీయ రహదారి అలైన్మెంట్ మార్చాలని
### ప్రజావాణిలో కలెక్టర్ కు వినతి



**వెల్గటూరు మార్చి 04 (ప్రజామంటలు)** గతంలో సర్వే చేసిన అలైన్మెంట్ మెంట్ లోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్.హెచ్. 63 జాతీయ రహదారి అలైన్మెంట్ మార్చాలని వెల్గటూర్ మండలం స్తంభంపల్లి గ్రామా రైతులు సోమవారం 11 గంటలకు ప్రజావాణిలో కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ రైతులు వారు మాట్లాడుతూ.... మాజీ మంత్రి గంగుల కమలాకర్ భూములు ఉన్నాయని అలైన్మెంట్ మార్చారని అన్నారు. భూమినే జీవనోపాధిగా చేసుకొని జీవిస్తున్న రైతులు రోడ్న పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే, ఛాపర్ ద్వారా నూతనంగా సర్వే చేసి హద్దులు పెడుతున్నారని, భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని గ్రామ రైతులు డిమాండ్ చేశారు. కొత్త సర్వే కాకుండా పాత సర్వే నే ప్రకారమే భూములను చేసి అ సర్వే ప్రకారం సర్వే చేసిండో అ సర్వే ప్రకారం రోడ్డు ను చేయాలి తప్ప మా భూముల నుంచి పోతే ఊరుకునేలేదని మేము ఉద్యమానికి కూడా సిద్ధమే అని అన్నారు. ఇప్పటికైనా పాత సర్వే ని చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్తంభంపల్లి గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ముఖ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలకు
### ఎమ్మెల్యే, సీ.ఐ. లకు ఆహ్వాన పత్రికలు అందజేత






**ధర్మసాగర్ మార్చి 04 (ప్రజామంటలు):** ముప్పారం గ్రామంలోని చారిత్రాత్మకమైన ముఖ్యనాథస్వామి దేవాలయంలో ఈ నెల 08 తారీకున జరిగే మహాశివరాత్రి మహొత్సవాలకు స్టేషన్ ఘణపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ని దేవస్థానం కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం హనుమకొండలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కలిసి ముఖ్యనాథస్వామి దేవస్థానం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి మహాశివరాత్రి ఉత్సవాలకు ఆహ్వానం అందజేశారు. అదే విధంగా ధర్మసాగర్ సీఐ మహేందర్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఉత్సవాల సందర్భంగా బందోబస్తు కల్పించాలని ఆలయ కమిటీ కోరారు. ఈ కార్యక్రమంలో ముఖ్యనాథస్వామి దేవస్థానం పునఃనిర్మాణం వ్యవస్థాపక ఛైర్మెన్ శివసాని ప్రవీణ్ రవీంద్ర, మాజీ ఎంపీటీసీ మేకల విజయ్ కుమార్, మాజీ సర్పంచ్ గడ్డం రాజేందర్, టీ.ఆర్.ఎస్. గ్రామ శాఖ అధ్యక్షులు బూర రమేష్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు దారపు రాములు, ముఖ్య సలహాదారులు గుంటిపల్లి సంపత్ కుమార్, మారబోయిన యాదగిరి, చెల్లోజు నాగభూషణం, మద్రిపల్లి రాజయ్య, అన్నం సునీల్ కుమార్, కందుకూరి రాజు తధితరులు పాల్గొన్నారు.

## తాటికొండ వినయ్ శర్మకు సీవీ రామన్ అకాడమీ పురస్కారం



**వేలేర్ మార్చి 04 (ప్రజామంటలు):** ప్రముఖ జ్యోతిష్య వాస్తు పండితులు, తాటికొండ వినయ్ శర్మకు సర్ సీవీ రామన్ అకాడమీ వారి సేవా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో పురస్కారాన్ని అందజేశారు. వినయ్ శర్మ జ్యోతిష్య వాస్తు రంగంలో అందిస్తున్న సేవలకు గాను సంస్థ వారి రుద్రాక్ష వైభవం పేరిట ఈ పురస్కారాన్ని అందజేశారు. ఆదివారం సికింద్రాబాద్ లోని హరిహర కళాభవన్లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమానికి సర్ సివి రామన్ అకాడమీ వారి సేవా సంస్కృతిక విభాగం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న విశిష్ట వ్యక్తులకు పురస్కారాలు, స్వర్ణ కంకణం మరియు జ్యోతిష వైభవనిధి అవార్డు ప్రధానం కార్యక్రమాలను నిర్వహించారు. అందులో భాగంగా జ్యోతిష్య వాస్తు విభాగంలో వినయ్ శర్మకు ఈ పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. కాగా తనకు పురస్కారాన్ని ప్రకటించడం ద్వారా తను జ్యోతిష విద్యను అభ్యసించిన తెలుగు విశ్వవిద్యాలయం నాకు ఎప్పుడూ రుణపడి ఉంటానని ఈ అవార్డు తన బాధ్యతను మరింత పెంచి, సమాజ శ్రేయస్సుకు తన వంతు కృషి చేసేలా ప్రోత్సహించినట్లు అయిందని వినయ్ శర్మ పేర్కొన్నారు.

## సాగునీటి కోసం రైతుల ధర్నా



**ధర్మసాగర్ మార్చి 04 (ప్రజామంటలు):** యాసంగి పంటలకు సాగు నీరు ని విడుదల చేయాలని ధర్మసాగర్ మండల కేంద్రంలో రైతులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ధర్మసాగర్ ప్రధాన రహదారి పై రైతులు ధర్నాకు దిగారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమయానికి కాలువలకు నీళ్లు వదలకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని తెలిపారు. భూగర్భ జలాలు సైతం అడుగంటి పోతున్నాయని, బావుల్లో నీళ్లు ఉండటం లేదని అన్నారు. సాగు పంటలకు అనుకూల సమయంలో సాగునీరు అందించి రైతులకు అండగా నిలవాలని రైతులకు కొరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాల్వల ద్వారా రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు.

## అయోధ్యకు తరలిన కొడిమ్యాల రామభక్తులు

**కొడిమ్యాల మార్చి 04 ( ప్రజామంటలు)** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలంలో రామ భక్తులు బాల రాముని దర్శనానికి అయోధ్యకు తరలి వెళ్లారు. అస్తా స్పెషల్ పేరుతో ప్రత్యేక కంగా ఏర్పాటు చేసిన రైలులో పెద్దపెల్లి నుండి బయలు దేరి వెళ్ళారు. వీరు 5 రోజుల్లో తిరిగి అదే రైలులో వస్తారని అయోధ్య భక్తులు తెలిపారు. అయోధ్యకు వెళ్లిన వారిలో ఏనుగు ఆదిరెడ్డి, చెన్న దేవేందర్, మ%శీ%చాల శ్రీనివాస్, కంచర్ల రామస్వామి, గుడి భూపతి రెడ్డి, వీరబత్తినీ గణేశ్, కనికరపు అశోక్, తదితరులు ఉన్నారు.



## అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**గొల్లపల్లి మార్చ్ 04 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలంలో అంగన్వాడి సెంటర్లో సూపర్వైజర్ మమత ఆధ్వర్యంలో ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ.... స్త్రీ లేకపోతే గమనం లేదు. స్త్రీ లేకపోతే సృష్టిలో జీవం లేదు. ఒక స్త్రీ తల్లిగా లాలిస్తుంది. చెల్లి గా తోడుంటుంది. భార్యగా బాగోగులు చూస్తు కుటుంబ భారాన్ని మోస్తూ సర్వం త్యాగం చేస్తుంది. సమాజంలో అన్ని మారుతున్నాయి. మహిళల పట్ల ఆలోచన ధోరణి తప్ప. సమాజ నిర్మాణంలో సగభాగమైన స్త్రీ సమానత్వమే మన ప్రగతికి మూలం. అందుకే ఐక్యరాజ్యసమితి మార్చి 8వ తేదీ న ప్రతి ఏటా అంతర్జాతీయ మహిళా దినోత్సవం గా నిర్వహిస్తుంది.

**"యత్ర నార్యాస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవత"**

ఎక్కడ స్త్రీలు పూజించబడతారో అక్కడ దేవతలు కొలువై ఉంటారని అర్థం. తర్వాత లింగ సమానత్వం గురించి కూడా వివరించరు. బాలికలు మహిళలపై జరుగుతున్న హింస గురించి వివరిస్తూ వాటిని అరికట్టే విధానాలను గురించి అలాగే గృహహింస నుండి రక్షణ వరకట్నం వేధింపులు లైంగిక హింస ఆడపిల్లల అత్యాచారాన్ని అరికట్టడం బ్రూణ హత్యల గురించి వివరించారు. అలాగే టోల్ ఫ్రీ నెంబర్స్ 181,1098 ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఐసిడిఎస్ సూపర్వైజర్ మమత సఖి వన్ స్టాప్ సెంటర్ సైకో సోషల్ కౌన్సిలర్ గౌతమి, ఏఎన్ఎం రజిత, ఆశ వర్కర్ ,మహిళలు పాల్గొన్నారు.

## చదువులమ్మ ఒడి మన వెంటే బడి: డా. బోగ శ్రావణి



**జగిత్యాల మార్చి 04 (ప్రజామంటలు):** పట్టణంలోని అరవింద్ నగర్ లో గల పురానిపేట్ పాఠశాలలో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ప్రత్యేక చొరవతో ఓ ఎన్ జి సి ద్వారా సిఎస్ఆర్ కార్యక్రమం కింద ఐఐటి కాన్పూర్ వారిచే అభివృద్ధి చేయబడ్డ ఎడ్యుకేషనల్ డెస్కులతో కూడిన స్కూల్ బ్యాగులను పంపిణీ చేసిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు జగిత్యాల నియోజకవర్గం ఇంచార్జ్. డా. బోగ శ్రావణి.ఈ సందర్భంగా డాక్టర్ బోగ శ్రావణి మాట్లాడుతూ.... భారతీయ జనతా పార్టీ నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఓ ఎన్ జి సి ద్వారా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ ఫండ్ ను ఉపయోగించి ఐఐటి కాన్పూర్ వారిచే అభివృద్ధి చేయబడ్డ ఎడ్యుకేషనల్ డెస్కులతో కూడిన స్కూల్ బ్యాగులను నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలోని 7అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రైమరీ స్కూల్ విద్యార్థులకు బ్యాగ్ కం స్టడీ టేబుల్ ని ఎంపీ అరవింద్ ప్రత్యేక చొరవ తీసుకొని నిరుపేద విద్యార్థులకు అందించడం జరుగుతుందనీ ఈ సందర్భంగా నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ అన్న కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ అధ్యక్షులు రంగు గోపాల్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆముదరాజు, పట్టణ యువమోర్చా అధ్యక్షులు వినీత్ గౌడ్, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు మమత, పట్టణ ఉపాధ్యక్షుడు గాధాస్ రాజేందర్, మల్లీశ్వరి భానుప్రియ,కవిత, పులి శ్రీధర్, ప్రశాంత్, బోగ రాజు, బడే శంకర్, రాజగోపాల్, శ్రావణ్, మరియు స్కూలు ఉపాధ్యాయులు మరియు నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## విశ్వశాంతి హైస్కూల్ లో జాతీయ భద్రతా దినోత్సవం



**రాయికల్ మార్చి 04 (ప్రజామంటలు):** రాయికల్ పట్టణంలోని స్థానిక విశ్వశాంతి పాఠశాలలో జాతీయ భద్రతా దినోత్సవాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తహశీల్దార్ యంఏ.ఖయ్యుం, స్వాతంత్ర్య సమర యోధుడు శతాధిక వయో వృద్ధుడు జైన్ ఉల్ ఉద్దీన్ మరియు మండల ప్రెస్ క్లబ్ జె.ఏ.సి. అధ్యక్షులు వాసరి రవి హాజరు అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.... ప్రస్తుత యువత చెడు మాదక ద్రవ్యాలకు అలవాటు కాకుండా తమ జీవితంలో ఉన్నత మైన లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని సాధించే దిశగా కష్టపడాలి అని తెలియజేశారు. అనంతరం జైన్ ఉల్ ఉద్దీన్ గారు స్వాతంత్ర్య ఉద్యమంలో తన అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.కార్యక్రమం లో పాఠశాల చైర్మన్ శ్రీ మచ్చ గంగాధర్ విద్యార్థులను ఉద్దేశించి దేవుడు ఇచ్చిన ఈ జీవితాన్ని సేఫ్టీ మరియు హైజెనిక్ మెజర్స్ కూడా పాటిస్తూ అలాగే స్టడీస్ లో రాణిస్తూ భవిష్యత్తుని ఉన్నతంగా మలుచుకోవాల్సిందిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## కరాటె లో ప్రతిభ చూపిన కెపిఎస్ విద్యార్థులు




**కోరుట్ల మార్చ్ 04 (ప్రజామంటలు):** వేములవాడలోఆదివారం జరిగిన ఒకినోవా స్పోర్ట్స్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన నాల్గవ తెలంగాణ స్టేట్ లెవెల్ ఓపెన్ కరాటే ఛాంపియన్షిప్- 2024 యందు కోరుట్ల పబ్లిక్ స్కూల్ కు చెందిన దాదాపు పది మంది విద్యార్థులు పాల్గొని వివిధ విభాగాలలో గోల్డ్, సిల్వర్ మరియు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. వీరిలో కోరుట్ల పబ్లిక్ స్కూల్ విద్యార్థులు అక్షర, అనన్య, తేజస్వి, మనోజ్ఞ మరియు శ్రీహిత గోల్డ్ మెడల్ సాధించగా వైష్ణవి, వాగ్దేవి మరియు వర్ణిక, సిల్వర్ మెడల్ ను సాధించగా నిత్యప్రియశ్రీ, బ్రాంజ్ మెడల్ సాధించడం జరిగిందని పాఠశాల కరస్పాండెంట్ గుజ్జేటి వెంకటేష్ తెలిపారు. విద్యార్థులు ముఖ్యంగా అమ్మాయిలు తమ స్వీయ రక్షణకై కరాటే పట్ల ఆసక్తితో పాటు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని మరియు ఘనత సాధించిన విద్యార్థులను, కెపిఎస్ కరాటే కోచ్ అల్లే రమేష్ మరియు అధ్యాపక బృందం అభినందించారు.

## ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీపీ



**మహాదేవపూర్ మార్చ్ 04 (ప్రజామంటలు):** మహాదేవపూర్ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల సేవా కేంద్రాన్ని మండల పరిషత్ కార్యాయంలో సోమవారం ఎంపీపీ బి. రాణీ బాయి రిబ్బిన్ కట్ చేసి ప్రారంభిచారు ఈ సందర్భంగ ఎంపీపీ మాట్లాడుతూ.... ఇందిరమ్మ రాజ్యం లో ప్రజాపాలన ఆరు గ్యరెంటీల అమలు కోసం ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు సేవా కేంద్రం ప్రారంభించామని ఎంపీపీ అన్నారు. మహాదేవపూర్ మండల ప్రజలకు ఇందిరమ్మ పాలన ఆరు గ్యారెంటీ లలోని సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వ అధికారులు ఎంపీటీసీ సభ్యులు స్వచ్ఛంద సంస్థలు కార్యకర్తలు కృషి చేస్తారని ప్రజాపాలన గ్రామ సభ రోజు గ్రామంలో లేని వారు వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు దరఖాస్తు చేసుకోవాలని ప్రజాపాలన దరఖాస్తు లో తప్పులను సరిచేసి నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు సేవా కేంద్రం ఏర్పాటు చేశామని ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎంపీపీ బి రాణీబాయి అన్నారు కార్యక్రమంలో ఎంపీటీసీ అకుతోట సుధాకర్ ఎంపిఒ ప్రసాద్ కార్యాలయ సూపరిండేంట్ శ్రీధర్, సిబ్బంది అరుణ్ కుమార్, శ్రీహరి, శ్రీకాంత్, కార్యదర్శులు రాజ్ కుమార్, మంజూరు అహ్మద్, రాజు, సతీష్, రమేష్, దామోదర్, అటెండర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# గృహజ్యోతి పథకం నిరుపేద కుటుంబాలకు అండ

## చీఫ్ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్







**జగిత్యాల మార్చి 04 (ప్రజామంటలు):** గృహజ్యోతి పథకం అర్హులైన నిరుపేద కుటుంబాలకు అండగా నిలుస్తుందని ధర్మపురి నియోజకవర్గ శాసన సభ్యులు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం జగిత్యాల పట్టణంలోని బుడగజంగాల కాలనీలో ఉచిత విద్యుత్ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి జీరో బిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటి పథకాలను దశల వారీగా ప్రారంభించి అర్హులైన నిరుపేద కుటుంబాలకు మంజూరు చేస్తూ ఆదుకోవడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్ సౌకర్యం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని పది లక్షలకు పెంచడం జరిగిందని వివరించారు. 200 యూనిట్ల లోపు వినియోగిస్తున్న నిరుపేద కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తూ ఆ డబ్బును ప్రభుత్వమే చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రానున్న కాలంలో ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదలకు మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. బుడగ జంగాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఈ సందర్భంగా పేర్కొన్నారు. శాసన మండలి సభ్యులు టి. జీవన్ రెడ్డి మాట్లాడుతూ.... రాష్ట్రంలోని ప్రతీ ఆడబిడ్డకు ఏదో ఒక సంక్షేమ పథకం అందించడం జరుగుతున్నదని అన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈ సంవత్సరం గత రెండు మాసాల నుండి విద్యుత్ ఎక్కువగా వినియోగం జరుగుతున్నదని తెలిపారు. వ్యవసాయ రంగానికి అంతరాయం కలుగకుండా విద్యుత్ ను సరఫరా చేయడం జరుగుతుందని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రవేశ పెడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై కూలంకషంగా అధికారులు, మంత్రి మండలితో చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. 200 యూనిట్ల కన్నా ఎక్కువ విద్యుత్ వినియోగం జరిగినట్లయితే జీరో బిల్లు రాదని తప్పనిసరిగా బిల్లులు చెల్లించవలసి వస్తుందని, పొదుపుగా విద్యుత్ వినియోగం చేసుకోవాలని సూచించారు. 500 రూ.లకే ఉచిత గ్యాస్ సిలిండర్ సరఫరా చేయడం జరుగుతుందని, ఒక్కో కుటుంబానికి సంవత్సరానికి 6 వేల రూపాయలు చెల్లించడం అదే విధంగా విద్యుత్ వినియోగంలో సంవత్సరానికి 12 వేల రూపాయలు వెరసి మొత్తం కుటుంబానికి 18 వేల రూపాయలు లబ్ది చేకూరుతున్నదని అన్నారు. సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లి వచ్చిన సుమారు 80 లక్షల మంది మహిళలు ఆర్టిసిలో ఉచిత ప్రయాణం కల్పించిన ఘనత రాష్ట్ర ప్రభుత్వందే నాని ఆయన అభివర్ణించారు. గృహ లక్ష్మి కార్యక్రమం కింద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 6 లక్షల చొప్పున త్వరలో చెల్లించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా మాట్లాడుతూ ప్రజా పాలన కార్యక్రమం కింద దరఖాస్తు చేసుకొని వారు జిల్లా వ్యాప్తంగా మండల పరిషత్, మున్సిపల్ కార్యాలయాలలో ఏర్పాటు చేసిన 36 సేవ కేంద్రాలలో తెల్ల రేషన్ కార్డ్ కలిగి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చుని, రేషన్ కార్డు లేని వారికి త్వరలో కొత్త కార్డుల జారీకి ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ సాంకేతిక కారణాల వల్ల లబ్ది చేకూరని వారు ఆయా కేంద్రాలకు వెళ్లి డాక్యుమెంట్లు సమర్పించాలని సూచించారు. ఉచితంగా వచ్చే విద్యుత్, గ్యాస్ సిలిండర్లను పొదుపుగా వాడుకోవాలని కలెక్టర్ అన్నారు. గృహ జ్యోతి కార్యక్రమం కింద అర్హులైన లబ్దిదారులకు 5 లక్షల రూపాయలు ఇళ్ళ నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరుగుతుందని, ఎస్సీ, ఎస్టీ లబ్దిదారులకు మరో లక్ష రూపాయలు అదనంగా చెల్లించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళల కోసం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి, జగిత్యాల ఆర్డిఓ మధుసుధన్, విద్యుత్ శాఖ ఎస్.ఈ., కాలనీ వాసులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి

## కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా





**జగిత్యాల మార్చి 04 (ప్రజామంటలు)** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులకు సత్వరమే పరిష్కార మార్గం చూపాలని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుండి ఫిర్యాదులు, వినతులను అదనపు కలెక్టర్ దివాకర తో కలిసి జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయప్రయాలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 50 ఫిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, జగిత్యాల, కోరుట్ల, మెట్ పల్లి ఆర్డిఒలు, మధు సుధన్, ఆనంద్ కుమార్, ఎన్. శ్రీనివాస్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ శ్రీనివాస్, కలెక్టరేట్ ఏ.ఓ. హన్మంతరావు, వివిధ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగదారులు గృహజ్యోతి పథకానికి అర్హులు

## విద్యుత్తు ఏఈ అర్జున్



**రాయికల్ మార్చి 04 (ప్రజామంటలు):** 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగదారులు గృహజ్యోతి పథకానికి అర్హులని విద్యుత్తు ఏఈ అర్జున్ అన్నారు. రాయికల్ పట్టణంలోని 11 వార్డులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్లులను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.... 200 యూనిట్ల లోపు విద్యుత్తు వినియోగదారులు గృహ జ్యోతి పథకానికి అర్హులన్నారు. రాయికల్ పట్టణం, మండల వ్యాప్తంగా 12744 గృహ జ్యోతి లబ్ధిదారులు ఎంపికైనట్లు తెలిపారు. మార్చి నెల నుండి 0 బిల్లుతో కూడిన విద్యుత్ చీటీని విద్యుత్ అధికారులు లబ్ధిదారుల ఇండ్ల వద్ద అందిస్తారని తెలిపారు. రేషన్ కార్డు ఉండి జీరో బిల్లు రానివారు, ప్రజా పాలనలో దరఖాస్తుల సవరణకు, నూతన లబ్ధిదారుల దరఖాస్తుకు రాయికల్ పట్టణం ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో మండల ప్రజలు ఎంపీడీవో కార్యాలయం లోని ప్రజా పాలన కౌంటర్లు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెండింగ్లో ఉన్న విద్యుత్ బిల్లులను చెల్లించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కొయ్యేడి మహిపాల్, నాయకులు ఏద్దండీ దివాకర్, బత్తిని నాగరాజ్, పడగల రవీందర్ రెడ్డి, షంషీర్ మోబిన్, బత్తిని భూమయ్య, నరసింహారెడ్డి, దాసరి గంగాధర్, జక్కుల రవి, సింగనీ రమేష్, మసూద్, కడకుంట్ల నరేష్, వాసం దిలీప్, లక్ష్మీనారాయణ, అశోక్, రామ్ కి, సందెల రాజేష్, కొత్తపెల్లి గోపాల్, మల్లేశం, రాజేష్, రాజీవ్,శివ, సిర్ప సంతు, సుధవేణి మురళి వేణు, రాజేందర్, కటకం సాయి, బైరి జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రంలో అధికారంలో ఉండి బండి సంజయ్ కరీంనగర్ పార్లమెంట్ అభివృద్ధికి ఏమి కృషి చేశాడు?

**మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి - కాంగ్రెస్ ప్రభుత్వం తోనే పేదలకు న్యాయం**

**పార్లమెంటు ఎన్నికల్లో సత్తా చాటేందుకు నాయకులు, కార్యకర్తలు కష్ట పడాలి**

**కాంగ్రెస్ ది త్యాగాల కుటుంబం**



**భీమదేవరపల్లి/మానకొండూర్ మార్చి 04 (ప్రజామంటలు):** తిమ్మాపూర్ లో జరిగిన మానకొండూర్ నియోజవర్గ స్థాయి సమావేశానికి ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తో కలిసి హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అంటేనే ఒక నమ్మకమని అందుకు అనుగుణంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నాడు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు సోనియా గాంధీ మాట ఇచ్చి అమలు చేసిందన్నారు. వైస్సార్ హయాంలో సైతం ఉచిత విద్యుత్ వాగ్దానాన్ని అమలు చేసి చూపించినట్లు గుర్తు చేశారు. ప్రత్యేక తెలంగాణ రాష్టాన్ని బిఆర్ఎస్ అప్పుల మయం చేసిందని దుయ్యబట్టారు. నేడు సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ ఆ పార్టీ ద్వారా గెలుపొంది అభివృద్ధి చేయలేదని తెలిపారు. కేవలం ఈజీఎస్ నిధులను సైతం తాను తెచ్చినట్లు చెప్పుకున్నట్లు తెలిపారు. ఏ పార్టీ ఎంపీ ఉన్నా అట్టి నిధులు వస్తాయని అందులో బండి సంజయ్ ప్రత్యేకత ఏమి లేదన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కష్టపడి పనిచేసి పార్టీ అభ్యర్థులను గెలిపించుకొవాలని కోరారు. ఈ సమావేశంలో మానకొండూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధులకు ఉచిత వైద్య శిబిరం హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ

## మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో



**భీమదేవరపెల్లి మార్చ్ 04 (ప్రజామంటలు):** మండలంలోని కొత్తపల్లి గ్రామంలో వృద్దులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం రెడ్ క్రాస్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మొబైల్ మెడికేర్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం కొత్తపల్లిలో వృద్దులకు ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం డిపార్ట్మెంట్ ఆఫ్ ఎంపవర్మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటిస్, సీనియర్ సిటిజన్స్, భారత ప్రభుత్వ సహకారంతో 60 సంవత్సరాలు పై బడిన వయో వృద్ధులకు ఇంటి వద్దనే సేవలనందించేందుకు హనుమకొండ రెడ్ క్రాస్, సంచార వైద్యశాల సేవలు అందిచడం జరుగుతుందని అన్నారు. ప్రతి నెల మీ గ్రామానికి వచ్చి క్యాంపు నిర్వహించి వృద్ధులకు బిపి. షుగర్ రక్త పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందించటం జరుగుతుందని అన్నారు. ఈ ఆరోగ్య శిబిరంలో చంద్ర శేఖర్ గుప్త, రెడ్ క్రాస్ డాక్టర్లు డా. జి. కిషన్ రావు, డా. మొహమ్మద్ తహర్ మసూద్, రెడ్ క్రాస్ సిబ్బంది గుల్లెపెల్లి శివకుమార్, అరువ గంగాధర్, అరుణ్ కుమార్, జక్కోజు నరసింహ చారి, పోశాలు, గ్రామస్తులు బత్తుల శ్రీకాంత్, సాయి వృద్దులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



**జగిత్యాల మార్చి 04 (ప్రజామంటలు):** జిల్లా కేంద్రంలోని ఎస్ వి ఎల్ఆర్ గార్డెన్ లో మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటు కోసం జిల్లా అధ్యక్షులు బాదినేని రాజేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి రాజ్ కుమార్ ల ఆధ్వర్యంలో విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొండ దేవయ్య మాట్లాడుతూ.... గత దశాబ్ద కాలం నుండి మున్నూరు కాపుల అభివృద్ధి కోసం మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, గత ప్రభుత్వము టిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ని రాష్ట్ర జిల్లా మండల గ్రామ సంఘాల కమిటీ సభ్యులు తమకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరిన, గత ప్రభుత్వము కార్పొరేషన్ ఇవ్వలేదని, మూడు ప్రధాన పార్టీలు అసెంబ్లీ ఎన్నికల్లో కార్పొరేషన్ ఇవ్వాలని మేనిఫెస్టోలో పెట్టాలని కోరామని, టిఆర్ఎస్ పార్టీ మరియు భారతీయ జనతా పార్టీ మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఇస్తానని మేనిఫెస్టోలో కూడా పెట్టలేదు కానీ కాంగ్రెస్ పార్టీ మీరు మాకు గెలిపించండి మీకు ఫైనాన్స్ కార్పొరేషన్ ఇస్తామని మరి యువకులకు ఇండస్ట్రీలలో కూడా వారికి కూడా ప్రోత్సహిస్తామని మేనిఫెస్టోలో తెలపగా రాష్ట్రంలో ఉన్న మున్నూరు కాపులందరు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటులో కృషిచేశారు, ఒక నెల రోజుల క్రితం బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, దుద్దిల్ల శ్రీధర్ బాబు ఐటి శాఖ మంత్రి కొండ సురేఖ, దేవాదాయ శాఖ మంత్రి వేములవాడ మరియు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా మున్నూరుకాపు సంఘాలు వివిధ పేర్లతో ఉన్న అందరిని పిలిచి సచివాలయంలో కార్పొరేషన్ గురించి వినతి పత్రాలు తీసుకోవడం జరిగినది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వంలోని మంత్రివర్యులు అందరికీ వినతిపత్రాలు అందజేయడం జరిగినది. కాంగ్రెస్ పార్టీ 64 మంది శాసనసభ్యులకు వినతి పత్రాలు అందజేయడం జరిగినది. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి 80 రోజులు అవుతుంది కావున పార్లమెంటు ఎన్నికలు ముందు మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య జిల్లా అధ్యక్షులు బాదినేని రాజేందర్, ప్రధాన కార్యదర్శి బండారి రాజ్ కుమార్, కోశాదికారి దీటి అంజయ్య పటేల్, ఉపాధ్యక్షులు సిరిపురం రాజేశం, కార్యదర్శి బారతపు లింగా రెడ్డి,అమిరిశెట్టి మల్లారెడ్డి,మార్గం నర్సారెడ్డి, అంగలి రాజన్న, ములాసపు రాజన్న, సలహాధారులు హరి అశోక్ కుమార్, వొడ్నాల రాజశేఖర్, కిలాగడ్డ గంగన్న, చిట్ల రవి, చెదలు సత్యనారాయణ, పడాల తిరుపతి, జంగిలి చంద్రమౌళి, మరాఠీ సత్తన్న, కొమిరెడ్డి లింగారెడ్డి, పాము సత్యనారాయణ, ముద్దం నాగరాజు, ఏనుగుల రాజేందర్, రామిడి మల్లయ్య, మామిడి సాగర్ ఎమ్ డిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎడ్ల రవి, యువత రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజీవ్, కార్యదర్శి బొంగురాల రాజేష్, విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సాసాల మల్లికార్జున్, చింతపండు మహేందర్, మెగిలి సతీష్,రత్నాకర్,జన్ను సంతోష్, సిద్ధి ధశరథం, తిరుపురం సాయిక్రిష్ణ, కూతురు శేఖర్, సాయిని పాపన్న, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందుర్తిలో ఘనంగా శ్రీయాలాల మల్లికార్జున స్వామి జాతర

**కోరిన కోరికలు తీర్చే కోరమీసల స్వామి**

**ఉదయం నుండే పెద్ద ఎత్తున బాలుతీరిన భక్తులు**

**ఆకట్టుకున్న మల్లన్న పట్నాలు, ఓగ్గు కథ**

**ప్రత్యేక పూజలు నిర్వహించిన లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రఘునాథ్ రెడ్డి**


**చిగురుమామిడి మార్చి 04 (ప్రజామంటలు):** చిగురుమామిడి మండలం ఇందుర్తి గ్రామంలో శ్రీ యాలాల మల్లికార్జున స్వామి జాతరను యాదవ కులస్థులు సోమవారం రోజున వైభవంగా నిర్వహించారు. ఆలయం వద్ద స్వామి వారికి బోనాలను సమర్పించి, మల్లన్న స్వామి, కేతమ్మ, మేడలమ్మ కళ్యాణ మహోత్సవంను ఘనంగా నిర్వహించారు కోరిన కోర్కెలను తీర్చే కోర మీసాల స్వామి వారిగా పేరు గాంచిన మల్లికార్జున స్వామి వారి ని దర్శించుకునేందుకు ఉదయం నుండి పెద్ద ఎత్తున భక్తులు బారులు తీరారు ఇందుర్తి చుట్టు పక్కల గ్రామాల నుండి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదే రఘునాథ్ రెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం యాదవ సంఘం నాయకులు స్వామివారి కండువాతో రఘునాథరెడ్డి నీ ఘనంగా సన్మానించారు. అనంతరం రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ.... దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలని మరో కొమురవెల్లి అయినవోలు తరహాల ఈ యాలల మల్లికార్జున స్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా రెండు జిల్లాల సరిహద్దు సిద్దిపేట జిల్లా కోహెడ మండల్ విజయనగర్ కాలనీ కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల్ ఇందుర్తి గ్రామాల మధ్యలో జరిగే శ్రీ యాలాల మల్లన్న స్వామి ఆలయం ముందు జోగు ఎత్తుట, మల్లన్న పట్నాలు, అగ్ని గుండాలు, ఓగ్గ కథ శివసత్తుల పూనకాలతో ఆందరిని ఆకట్టుకోని ఆలోచింపజేశాయి. భక్తులకు గ్రామస్థుల సహాకారంతో యాలాల మల్లన్న దేవాలయ ఆవరణలో పోచమ్మ దేవాలయం తో పాటు ఎల్లమ్మ దేవాలయం నిర్మించడంతో భక్తులు ఆలయాలలో ఉదయం నుండి పెద్ద ఎత్తున దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి బోనం ఒగ్గు కళాకారుల చెల్లించి మొక్కులు సమర్పించారు ఈ సంవత్సరం ఎన్నడు లేని విధంగా భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో నీడ కోసం చలవ పందిర్లు టెంటులు ఏర్పాటు చేసి చల్లని మినరల్ వాటర్ అందించారు. భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు యాదవ దేవస్థాన కమిటీ ఏర్పాటు చేశారు. ఆనంతరం సంఘం అధ్యక్షులు యాదవ సంఘం నాయకులు మాట్లాడుతూ.... ఆలయం ముందు , లైట్లు, నీటి సమస్యతోపాటు ఆలయా చుట్టూ ఉన్న అరున్నర ఎకరాల భూమి కి ప్రహరీ గోడతోపాటు పలు సౌకర్యాలను హరితహారం లో నీడ కోసం చెట్లు పెంచేలా మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేయాలని తెలిపారు ఉదయం నుండి ఇందుర్తి తదితర ప్రాంతాలతో పాటు నారాయణపూర్ విజయనగర్ కాలనీ గునుకులపల్లి, అరకాలపల్లి కూనచుల పల్లి, బొల్లోని పల్లె చింతాలపల్లి, ఓగులాపూర్, తదితర గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు జాతరలో ఇలాంటి ఇబ్బందులు కలవకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. స్వామివారిని సింగిల్ విండ వైస్ చైర్మన్ కర్వేద మహేందర్ రెడ్డి రైతు సంఘం అధ్యక్షులు కాంతాల శ్రీనివాస్ రెడ్డి మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొమ్మెర మంజుల మహేందర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం లో జాతర కమిటీ అధ్యక్షులు పోతరవేణి బాలయ్య, యాదవ సంఘం అధ్యక్షుడు పోతరవేణి మహేష్,పోతరవేణి కొమురయ్య, పొతరేణి మల్లయ్య, పొతరవేణి లింగయ్య,పోతరవేణి శ్రీనివాస్, పోతరవేని కుమార్ సంధవేని మల్లేష్, పొతరవేని శ్రీనివాస్, పెద్ద కనకయ్య, ముత్తయ్య, చిన్న ఎర్ర రాజయ్య, పూజారి సంధవేని బాలయ్య, పోతరవేణి మల్లేష్, సంధవేని మల్లేశం, శ్రీనివాస్, లింగయ్య, శ్రీశైలం, జంగ నరసయ్య, లెంకల సంపత్,నరాల లింగం, మేదరవెల్లి తిరుపతి, నక్క రాజు మాజీ ప్రజా ప్రతినిధులు గ్రామస్తులు యువకులు మహిళలు తదితరులు పాల్గోన్నారు.





# గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## జగిత్యాల బల్దియా చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్



**జగిత్యాల మార్చి 04 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన గృహ జ్యోతి పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల బల్దియా చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ కోరారు. జగిత్యాల పట్టణంలోని 8వ వార్డులో 6 గ్యారెంటీలలో భాగంగా గృహజ్యోతి పథకంలో 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి, బల్దియా చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్, కార్యక్రమాన్ని ప్రారంభించారు. గృహ జ్యోతి పథకం కింద నెలకు 200 యూనిట్ల లోపు కరెంటు వాడే వినియోగదారులకు జీరో కరెంట్ బిల్లు జారీ ప్రక్రియ కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బల్దియా చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ.... గృహ జ్యోతి పథకంతో తెల్ల రేషన్ కార్డులు కలిగి అర్హులైన కుటుంబాలకు నెలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు. ఎవరికైనా ఇతర కారణాల వల్ల జీరో కరెంట్ బిల్లు రాకపోతే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అలాంటి వారు మరలా తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు తీసుకొని అప్లయ్ చేసుకోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పేదల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పక్కదారి పట్టకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రతి నెలా విద్యుత్ బిల్లు చూసి పేదలు ఇబ్బందులు పడేవారని, ఆ బాధలకు చెక్ పెట్టాలనే రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. ప్రజలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా, మున్సిపల్ చైర్ పర్సన్ అడువాల జ్యోతి-లక్ష్మణ్, మరియు విద్యుత్ శాఖ అధికారులు కౌన్సిలర్స్ నాయకులు పాల్గొన్నారు.

# శ్రీలీలను వెంకీ కుడుముల పక్కన పెట్టారా?



తెలుగు నటి శ్రీలీల గత సంవత్సరం అంతా తెలుగు సినిమాలతో చాలా బిజీగా ఉండేది. ఆమె తేదీలు దొరకటమే కష్టంగా వుంది అని పరిశ్రమలో ఒక టాక్ కూడా నడిచింది. నటుడు నితిన్ అయితే ఆమె ఎప్పుడు షూటింగ్ వస్తుంది, ఎన్ని గంటలు షూటింగ్ చేస్తుంది, ఆ కేటాయించిన గంటల్లో ఆమెతో ఎటువంటి సన్నివేశాలు చెయ్యాలి అనేదే మాకు పెద్ద ఛాలెంజ్ అని తన 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' చిత్ర ప్రచార సభల్లో చెప్పారు కూడా. మరి అంత బిజీగా వున్న శ్రీలీలని దర్శకుడు వెంకీ కుడుములతో చెయ్యబోయే తదుపరి సినిమాలో కూడా ఎందుకు తీసుకున్నారు అంటే దర్శకుడు వెంకీ ఆమే కావాలి అన్నారని, చెప్పారు నితిన్. గత సంవత్సరం శ్రీలీల చేసిన సినిమాలు వరసగా 'స్కంద', 'భగవంత్ కేసరి', 'ఆదికేశవ; 'ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్' అలాగే ఈ సినిమాలకి కొనసాగింపుగా ఈ సంవత్సరం సంక్రాంతికి 'గుంటూరు కారం' విడుదలైంది. రెండు రోజుల క్రితం నితిన్, వెంకీ కుడుముల సినిమా 'రాబిన్ హుడ్' సినిమా షూటింగ్ గురించి తాజా సమాచారం ఇస్తూ ఒక అధికారిక ప్రకటన వచ్చింది. ఏమైందో ఏమో కానీ అందులో శ్రీలీల పేరు లేకపోవటం ఆసక్తికరం. ఈ సినిమాలో మొదట రష్మిక మందన్న కథానాయిక అనుకున్నారు, కానీ ఆమె అప్పట్లో హిందీ సినిమాతో బిజీగా ఉండటం వలన ఆమెకి బదులు శ్రీలీలని తీసుకున్నారు. కానీ ఇప్పుడు పంపిన అధికారిక ప్రకటనలో తారాగణం అంటూ నితిన్, వెన్నెల కిశోర్, రాజేంద్ర ప్రసాద్ పేర్లు చెప్పారు కానీ శ్రీలీల పేరు అందులో లేదు. అంటే శ్రీలీల ఈ మూవీ నుండి తప్పుకున్నారా, లేక నితిన్ అప్పుడు అన్న మాటలకి దర్శకుడు వేరే కథానాయికని పెట్టుకోవాలని అనుకున్నారా అనే విషయం మీద పరిశ్రమలో చర్చ నడుస్తోంది. ఇదిలా ఉండగా నితిన్ కి మంచి విజయాన్ని 'భీష్మ' సినిమాతో అందించిన దర్శకుడు వెంకీ కుడుముల దర్శకత్వంలో చేస్తున్న'రాబిన్‌హుడ్' చిత్రంలో పూర్తిగా భిన్నమైన లుక్ లో నితిన్ అలరించనున్నారు అని ఆ అధికార ప్రకటనలో చెప్పారు. ఈ సినిమా మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలు. ఇది ఒక వినోదాత్మక యాక్షన్ అడ్వెంచర్ అని ఇందులో నితిన్ దొంగగా నటిస్తున్నారని చెప్పారు. ఆ ప్రకటన ప్రకారం దర్శకుడు ఇప్పుడు ఇంటర్వెల్ యాక్షన్ ఎపిసోడ్ షూటింగ్ ప్రారంభించారు అని తెలిసింది. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ ఈ యూనిక్ యాక్షన్ బ్లాక్‌ని ఇంట్రస్టింగ్‌గా డిజైన్ చేస్తున్నట్టుగా తెలిసింది.

# భీమా విజయం సాధిస్తుంది గోపీచంద్




ఇప్పుడు మంచి విజయం కోసం ఎదురు చూస్తున్న నటుల్లో గోపీచంద్ ఒకరు. అతనిప్పుడు ఒక యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఎ హర్ష దర్శకత్వం వహిస్తున్నారు, కె కె రాధామోహన్ నిర్మాత. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ కథానాయికలుగా నటించారు. మార్చి 8న మహా శివరాత్రి సందర్భంగా ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ విడుదల వేడుక హన్మకొండ వరంగల్ లో నిర్వహించారు. ఈ సందర్భంగా కథానాయకుడు గోపీచంద్ మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత మీ అందరినీ చూడటం చాలా ఆనందంగా వుంది. ఇన్నేళ్ళ నుంచి నన్ను మీ గుండెల్లో పెట్టి చూసుకుంటున్న మీ అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు అని చెప్పారు. 'భీమా' సినిమా గురించి చెపుతూ, ఈ సినిమా మొదలుపెట్టడానికి మా కో ప్రొడ్యూసర్ శ్రీధర్ గారు కారణం. ఆయనే దర్శకుడు హర్షని నాకు పరిచయం చేశారు. 'భీమా' అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది, ప్రతి సన్నివేశం చాలా బావుటుంది అని చెప్పారు గోపీచంద్. 'నేను సాధారణంగా ఇలా చెప్పాను... కానీ ఈ సినిమా కేక పుట్టిస్తుంది. అందులో సందేహం లేదు. ఇంత బాగా సపోర్ట్ చేసిన నిర్మాత రాధమోహన్ గారికి ధన్యవాదాలు,' అని చెప్పారు గోపీచంద్. ఈ సినిమాకి సంగీత దర్శకుడు రవి బస్రూర్ అద్భుతమైన సంగీతం ఇచ్చారని అతన్ని కొనియాడారు గోపీచంద్. ఈ 'భీమా' సినిమాకి వేరే లెవల్ లో సంగీతం కొట్టాడు. అలాగే యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్ లక్ష్మణ్, వెంకట్, రవి వర్మ చాలా ఎక్స్ ట్రార్డినర్గీ ÷ట్ సీక్వెన్స్ ఇచ్చారని చెప్పారు. ఇంటర్వెల్, క్లైమాక్స్ ఫైట్స్ గొప్పగా అలరిస్తాయి. అజ్జు చాలా పవర్ ఫుల్ డైలాగ్స్ రాశాడు. తను చాలా మంచి రైటర్ అవుతాడు అని తన సినిమా ఈసారి విజయం సాధిస్తుందని చాలా నమ్మకంగా చెప్పారు గోపీచంద్.

# 19 ఏళ్ల కెరీర్ పూర్తి చేసుకున్న తమన్నా

తన నటనతో ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకున్నారు నటి తమన్నా. ఆమె సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి 19 ఏళ్లు పూర్తయింది. దీంతో సినీ ప్రముఖులు, అభిమానులు అభినందనలు తెలుపుతున్నారు. ఈ సందర్భంగా నటి కాజల్ అగర్వాల్ శుభాకాంక్షలు చెబుతూ అభిమానులు ఎడిట్ చేసిన తమన్నా పోస్టర్లను షేర్ చేశారు. దీనికి తమన్నా రిప్లై ఇచ్చారు. 'థాంక్యూ కాజు. ఇన్ని సంవత్సరాల నుంచి నాకెంతో మద్దతుగా నిలిచావు. హద్దులు లేనిప్రేమను పంచావు. నీ లాంటి స్నేహితురాలు ఉండడం వల్లే నా కెరీర్ హాయిగా కొనసాగుతోంది. అభిమానుల అద్భుతమైన అంకితభావం, వాళ్ల ఉత్సాహం నాకు రెట్టింపు శక్తినిస్తాయి. మీ అందరికీ నచ్చే చిత్రాలను అందిస్తానని హామీ ఇస్తున్నా. రానున్న సంవత్సరాలు ప్రేమతో నిండిన లెక్కలేనన్ని జ్ఞాపకాలను అందిస్తాయని ఆశిస్తున్నా' అని రిప్లై ఇచ్చారు. తమన్నా 2005లో హిందీ సినిమా 'చాంద్ సా రోషన్ చెహ్రా'తో తెరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. అదే ఏడాది 'శ్రీ' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చారు. ఆ తర్వాత తెలుగు, తమిళ, హిందీ భాషల్లో అగ్ర హీరోల సరసన నటించి గుర్తింపు తెచ్చుకున్నారు. ఒకవైపు సినిమాలు చేస్తూనే మరోవైపు వెబ్ సిరీస్‌లలో నటిస్తున్నారు. ప్రస్తుతం నాలుగు సినిమాలతో బిజీగా ఉన్నారు. తెలుగులో 'ఓదెల రైల్వేస్టేషన్' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న 'ఓదెల 2'లో తమన్నా ప్రధాన పాత్రధారిగా నటిస్తున్నారు. అశోక్‌తేజ దర్శకుడు. సంపత్ నంది టీమ్ వర్క్స్‌తో కలిసి మధు క్రియేషన్స్ పతాకంపై డి.మధు నిర్మిస్తున్నారు. హెబ్బా పటేల్, వశిష్ఠ ఎన్.సింహ కీలక పాత్రలు పోషిస్తున్నారు.






# పెళ్లి సందడితో లగ్గం సినిమా

సుభిషి ఎంటర్‌టైన్‌మెంట్ పై వేణుగోపాల్ రెడ్డి నిర్మిస్తున్న సినిమా లగ్గం భీమదేవరపల్లి బ్రాంచి సినిమాతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న రమేష్ చెప్పాలఈ సినిమాకు రచన, దర్శకత్వం వహిస్తున్నారు. సాయి రోనాక్, ప్రగ్యా నగ్రా జంటగా నటిస్తున్న ఈ సినిమాలో రాజేంద్రప్రసాద్, రోహిణి, ఎల్.బి శ్రీరామ్, సప్తగిరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రానికి కాసర్ల శ్యామ్ సాహిత్యం, చరణ్ అర్జున్ సంగీతం అందిస్తున్నారు. మన తెలుగు సంప్రదాయంలోని తెలంగాణ పెళ్లినీ కన్నుల విందుగా చూపించ బోతున్నామని, ప్రతి ఒక్కరు ఈ చిత్రం గురించి మాట్లాడుకుంటారని, కళ్ళ ముందు కొత్త ఎక్స్పీరియన్స్ ను ఉంచే ఈ సినిమా.. కొన్ని తరాలు గుర్తుంచుకునే చిత్రం అవుతుందని...' అని దర్శకుడు రమేష్ చెప్పాల నిర్మాత వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా.నటుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. 'ఇది వరకు తెలుగు సాంప్రదాయంలో జరిగే పెళ్లి కాన్సెప్ట్ తో చాలా చిత్రాలు వచ్చాయని, అందుకు భిన్నంగా ఈ లగ్గం సినిమా ఉండ బోతోందని తెలంగాణదనం ఉట్టిపడే విధంగా దర్శకుడు రమేష్ ఈ సినిమాను తేరకెక్కిస్తున్నాడని' అన్నారు. అన్ని రకాల హంగులతో దర్శకుడు లగ్గం యూనివర్స్ ను క్రియేట్ చేయబోతున్నాడని నటి రోహిణి తెలిపింది.

# అంబానీ ఇంట పెళ్లి వేడుకల్లో బిగ్ బి



అంబానీ ఇంట జరుగుతున్న పెళ్లి వేడుకలు అద్భుతంగా ఉన్నాయని బాలీవుడ్ అగ్ర కథానాయకుడు అమితాబ్ బచ్చన్ ప్రశంసించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త ముకేశ్ అంబానీ చిన్న కుమారుడు అనంత్ అంబానీ, రాధికా మర్చెంట్ ప్రీవెడ్డింగ్ వేడుకలు ఘనంగా జరిగాయి. గుజరాత్ జామ్‌నగర్‌లో నిర్వహించిన ఈ వేడుకల్లో అనేకమంది సినీ తారలు పాల్గొన్నారు. అమితాబ్ బచ్చన్ కుటుంబసమేతంగా ఈ వేడుకలకు హాజరయ్యారు. తిరిగి ముంబయి వెళ్తూ తన బ్లాగ్‌లో నోట్ రాశారు. 'అట్టహాసంగా నిర్వహించిన వేడుకలతో పాటు, వంతారా ఏర్పాటు చేయాలన్న ఆలోచన ప్రశంసనీయం. ఈ వేడుకలో భాగం అయినందుకు సంతోషంగా ఉంది. వంతారా సమగ్ర జంతు సంరక్షణ, పునరావాస కేంద్రం. గాయపడిన జంతువుల్ని కాపాడటం, చికిత్స అందించి వాటికి పునరావాసం ఏర్పాటు చేయాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారు. ఇలాంటి ఒక కృత్రిమ అడవిని ఏర్పాటు చేసి వన్యప్రాణుల్ని కాపాడాలన్నది మంచి ఆలోచన. మీరందరూ దీనిని సందర్శించాలి. ఇదో గొప్ప అనుభవం' అని అమితాబ్ బచ్చన్ పేర్కొన్నారు. అనంత్-రాధికల ప్రీవెడ్డింగ్ వేడుకల్లో రణ్‌బీర్-అలియా, దీపికా-రణ్‌వీర్ సింగ్, కరీనా కపూర్-సైఫ్ అలీ ఖాన్ తదితర బాలీవుడ్ జంటలు ప్రత్యేకంగా డాన్స్ చేసి సందడి చేశాయి. బాలీవుడ్ ఖాన్స్ త్రయం సల్మాన్, షారుక్, ఆమిర్‌తో కలిసి హీరో రామ్ చరణ్ 'నాటునాటు' పాటకు స్టెప్పులేసి అలరించారు. వీరితోపాటు అక్షయ్‌కుమార్, జాన్వీ కపూర్, అనన్య పాండే, సారా అలీఖాన్, ఖుషీ కపూర్..తదితరులు ఈ వేడుకకు హాజరయ్యారు.

## గీతామాధురి కొడుకు బారసాల



సింగర్ గీతామాధురి తెలుగునాట ప్రత్యేక గుర్తింపు ఉంది. తన హస్కీ వాయిస్‌తో పాడిన పాటలు ఎన్నో అభిమానుల నోట నిత్యం ఎక్కడోచోటా నానుతూనే ఉంటాయి, వినిపిస్తూ ఉంటాయి. 2014లో నటుడు నందును పెళ్లి చేసుకున్న ఆమె తర్వాత ఎక్కువగా ఫ్యామిలీ లైఫ్ ఎంజాయ్ చేస్తోంది. 2019లో ఫస్ట్ ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఆ పాపకు దాక్షాయణి ప్రకృతి అని పేరు పెట్టారు. ఇదిలాఉండగా ఈ మధ్యే గీతామాధురి మరోమారు తల్లి అయిన విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని 'ఫిబ్రవరి 10న మాకు కొడుకు పుట్టాడు.. మా జీవితాల్లోకి ఆనందం తెచ్చాడు..' అంటూ నందు సామాజిక మాధ్యమాల్లో అభిమానులతో పంచుకున్నారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం నందు, గీతా మాధురి జంట తమ కుమారుడికి బారసాల, నామకరణం కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి బాబుకు ఎన్టీఆర్ పేరు కలిసొచ్చేలా 'ధృవధీర్ తారక్' అని పేరు పెట్టారు. ఇప్పుడు ఈ విషయం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. తెలుగు సినిమా ఇండస్ట్రీ నుంచి నటులు, సింగర్స్, మ్యూజిక్ డైరెక్టర్స్ కొద్దిమంది ,ఇంకా చాలా మంది సెలబ్రిటీస్, బిగ్‌బాస్ కంటెస్టెంట్స్ ఈ వేడుకకు హజరై వారికి శుభాకాంక్షలు తెలిపారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న సమంత



తిరుమల శ్రీవారిని, తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత దర్శించుకుంది. సోమవారం ఉదయం ఆలయం వద్దకు చేరుకున్న సమంతకు ఆలయ అధికారులు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారి పుష్పాంజలి సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు సమంత. ఇక అమ్మవారి దర్శనం అనంతరం సమంతకు పండితులు వేద ఆశీర్వాదం అందించారు. ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి సమంతకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అయితే సమంత తిరుచానూరు వచ్చిందని తెలియడంతో ఒక్కసారిగా సమంతను చూడడానికి అభిమానులు ఎగబడ్డారు. కొందరు ఆమెతో సెల్ఫీలు దిగారు. చాలారోజుల తర్వాత పద్మావతీ అమ్మవారి ఆలయానికి వచ్చిన సమంత చాలా సంతోషంగా నవ్వుతూ కనిపించారు.

# ఫ్యాన్స్‌కు విందు ఇచ్చిన నటుడు సూర్య

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నాడు గతంలో మిగ్‌జాం తుపాను సమయంలో సూర్య ఫ్యాన్స్ వేలమంది బాధితులకు సాయం చేసిన సంగతి తెలిసిందే. తాజాగా వారికి సూర్య విందును ఏర్పాటు చేశారు. గత ఏడాది మిగ్‌జాం తుపాను కారణంగా తమిళనాడు అల్లకల్లోలం అయిన విషయం తెలిసిందే. భారీ వర్షాల కారణంగా తమిళనాడులోని చెన్నై తదితర ప్రాంతాలు వరదల్లో మునిగిపోయాయి. దీంతో ప్రజల జీవనోపాధిపై ప్రభావం పడింది. వరద నీటిలో ఎంతో మంది పేద ప్రజల గృహాలు కొట్టుకుపోయాయి, ఎంతో ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగింది. వేలాది మంది అన్నం, నీళ్లు లేక ఇబ్బంది పడ్డారు. అయితే ఈ వరదల్లో నష్టపోయిన ప్రజలకు సూర్య, కార్తీలు వెంటనే రూ. 10 లక్షలు ఆర్థిక సాయం ప్రకటించారు. ఇక ఈ వరదల్లో సర్వం కోల్పోయిన ప్రజలకు అండగా ఉండాలని సూర్య తన ఫ్యాన్స్ కు పిలుపునిచ్చాడు. దీంతో మరో ఆలోచన లేకుండా ఫ్యాన్స్ అందరూ వచ్చి సాయం చేశారు. అయితే అభిమానుల సేవలు గుర్తించిన సూర్య.. వారందరీని ఒక్కసారి కలుసుకోవాలని విందు ఏర్పాటు చేశారు. ఇక ఈ విందులో తన అభిమానులకు స్వయంగా సూర్యనే వడ్డించడం విశేషం. అలాగే గత రెండేళ్లలో పెళ్లి చేసుకున్న దాదాపు 50 మంది అభిమానులను కలుసుకుని వారికి శుభాకాంక్షలు తెలిపాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



## భారత్, పాక్ మ్యాచ్ టిక్కెట్ ధర రూ.1.86 కోట్లు?



ప్రస్తుతం భారత్‌లో ఐపీఎల్ ఫీవర్ మొదలైంది. మరికొద్ది రోజుల్లో ప్రపంచ క్రికెట్‌లోని స్టార్ క్రికెటర్లు 10 జట్లతో ఆడుతున్నారు. ఈ మిలియన్ డాలర్ల టోర్నీ ముగిసిన వెంటనే అభిమానులకు మరో ట్రీట్ లభించనుంది. అదే టీ20 వరల్డ్ కప్ . ఈ టీ20 ప్రపంచకప్‌నకు వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. ఈ పోట్టి ఫార్మాట్ షెడ్యూల్ ఇప్పటికే విడుదలైంది. దీని ద్వారా యావత్ ప్రపంచం ఎదురు చూస్తున్న భారత్–పాకిస్థాన్ ప్రపంచకప్ ఫైట్ మ్యాచ్ తేదీ కూడా తెలిపోయింది. ఇప్పుడు ఆ రోజు కోసం ఎదురుచూస్తున్న కోట్లాది అభిమానులకు ఈ మ్యాచ్ టిక్కెట్ ధర పెద్దగా షాక్ ఇవ్వనుంది. 2024 ప్రపంచకప్ ప్రారంభానికి ఇంకా నెలరోజుల సమయం ఉంది. విడుదలైన షెడ్యూల్ ప్రకారం, ఈ పోట్టి ఫార్మాట్‌లో మొదటి మ్యాచ్ జూన్ 1న జరగనుండగా, ఫైనల్ మ్యాచ్ అదే నెల 29న జరగనుంది. దీని ద్వారా ఈ ప్రపంచ యుద్ధానికి తెర పడనుంది. జూన్ 1 నుంచి ప్రపంచకప్ ప్రారంభమైనప్పటికీ, అభిమానులకు ప్రపంచకప్ భారత్–పాకిస్థాన్ మధ్య మరో మ్యాచ్. ఈ మ్యాచ్ జూన్ 9న జరగనుండగా, ఈ మ్యాచ్‌కి న్యూయార్క్ ఆతిథ్యం ఇస్తోంది. అలాగే రెండు జట్లూ ఒకే గ్రూపులో ఉన్నాయి. దీంతో లీగ్‌లో చిరకాల ప్రత్యర్థుల మధ్య పోరు నెలకొంది. ఐతే ఈ మ్యాచ్ చూసేందుకు హడావుడి ఇప్పటికే మొదలైంది. మరోవైపు టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌ల టిక్కెట్ల విక్రయాన్ని ఐసీసీ ప్రారంభించింది. దీని ప్రకారం భారత్–పాకిస్థాన్ మ్యాచ్ మినహా మిగిలిన మ్యాచ్‌ల టిక్కెట్ల ధర సామాన్యులకు అందుబాటులో ఉన్నాయి. %×జజ% ఈ మ్యాచ్‌లకు అత్యల్ప ధరను 6 డాలర్లు అంటే 500 భారతీయ రూపాయలుగా నిర్ణయించింది. అత్యంత ఖరీదైన టిక్కెట్ ధర 25 డాలర్లు అంటే 2071 భారత రూపాయలుగా నిర్ణయించింది. ఈ టికెట్ ధర సామాన్యులకు అందుబాటులో ఉండడంతో మొదట్లో క్రికెట్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. కానీ భారత్, పాకిస్థాన్ మ్యాచ్ టిక్కెట్ ధర మాత్రం అభిమానులకు కాస్త భారీగానే కనిపిస్తోంది. సాధారణ మ్యాచ్‌లకు సరసమైన ధరలను నిర్ణయించిన ఐసీసీ.. భారత్–పాక్ మ్యాచ్‌కి కనీస టిక్కెట్ ధరను 175 డాలర్లు అంటే 14,450 రూపాయలుగా నిర్ణయించింది. అయితే గరిష్ట టిక్కెట్ ధర 33,000 రూపాయలుగా ఉంచింది. ఈ మ్యాచ్ టిక్కెట్ల రీసేల్ ధర ఈ మొత్తం ఖరీదైనదని భావించిన క్రికెట్ ప్రేమికులకు భారీ షాక్ తగిలింది.ఇండియా–పాక్ మ్యాచ్ టిక్కెట్‌లను మళ్లీ విక్రయించిన %హ్‌బఎబఎ, రామ్‌క్‌+వవన% వంటి ప్లాట్‌ఫారమ్‌లు ఈ టిక్కెట్‌ల ధరలను పెంచాయి. దీని ప్రకారం, ఒక టికెట్ అధికారిక ధర 400 డాలర్లు అయితే, దాని రీసేల్ ధర 40 వేల డాలర్లు అంటే 33 లక్షల రూపాయలకు పెరిగింది. దీనికి ఇతర ఛార్జీలు కలిపితే ఒక టికెట్ ఖరీదు మొత్తం 41 లక్షల రూపాయలు అవుతుంది. భారతదేశం వర్సెస్ పాకిస్తాన్ మ్యాచ్ కోసం అత్యంత ఖరీదైన టిక్కెట్ %వి%1,75,000లుగా పేర్కొంది. అంటే భారతీయ రూపాయలలో దీని ధర దాదాపు రూ.1.4 కోట్లు. దీనికి మరికొన్ని చార్జీలు కలిపితే మొత్తం ధర 1.86 కోట్లకు చేరింది. ఇంత డబ్బు వస్తే జీవితాంతం హాయిగా జీవించొచ్చు అనేది చాలామంది అభిప్రాయం. ఎంత ఖర్చయినా సరే ఆ టికెట్ కొని మ్యాచ్ చూడాలని భావించే వారి సంఖ్య కూడా పెరిగిపోయింది. దీంతో టిక్కెట్ల ధర భారీగా పెరిగిపోయింది. మరి రానున్న రోజుల్లో ఈ రేటు ఎంత వరకు పెరుగుతుందో చూడాలి.

## మూడో కొత్త కెప్టెన్ తో సన్‌రైజర్స్ బరిలోకి



సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో మంచి ఆటగాళ్లు ఉన్నప్పటికీ ప్లే ఆఫ్?కు చేరకముందే నిష్క్రమిస్తుంది. ఇలాంటి క్రమంలో ఈసారి జరిగిన వేలంలో యాజమాన్యం ఆచితూచి మంచి ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంది. ఆస్ట్రేలియా సారథి ప్యాట్ కమిన్స్, ట్రేవిస్ హెడ్, హసరంగా వంటి విదేశీ ఆటగాళ్లను జట్టులోకి తీసుకుంది. దీంతో ఈసారి సన్ రైజర్స్ జట్టు బలంగా కనిపిస్తుంది. ఇదిలా ఉంటే.. ఐపీఎల్ 2024 సీజన్ ప్రారంభానికి ముందు సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం తమ జట్టుకు కొత్త సారథిని నియమించింది. 2023 వరల్డ్ కప్ సాధించడంలో కీలక పాత్ర పోషించిన ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ కు పగ్గాలు అప్పజెప్పింది. ఇప్పటివరకు దక్షిణాఫ్రికా స్టార్ క్రికెటర్ ఐడెన్ మార్క్రమ్ కెప్టెన్ గా బాధ్యతలు వహించాడు. కాగా.. అతన్ని తొలగించి.. కమిన్స్ కు కెప్టెన్సీ బాధ్యతలు అప్పజెప్పింది. అయితే కమిన్స్ ను రూ. 20.50 కోట్లు పెట్టి సన్ రైజర్స్ యాజమాన్యం కొనుగోలు చేసింది. అయితే ఈసారి ఎలాగైనా ఐపీఎల్ టైటిల్ గెలవాలనే కసితో యాజమాన్యం ఈ నిర్ణయం తీసుకుంది.కాగా, ఎస్ఆర్‌హెచ్ కీలక మార్పులతో బరిలోకి దిగుతోంది. గడిచిన రెండు సీజన్లలో ఎస్ఆర్?హెచ్ ఇద్దరు కొత్త కెప్టెన్లతోనే బరిలోకి దిగింది. 2022లో కేన్ విలియమ్సన్, 2023లో మార్క్రమ్ ఆ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించారు. ఇప్పుడు మూడో కొత్త కెప్టెన్ తో సన్‌రైజర్స్ బరిలోకి దిగుతోంది. ఇదిలా ఉంటే.. ఈ సీజన్‌లో హైదరాబాద్ జట్టు కోచింగ్ స్టాఫ్‌ను కూడా మార్చింది. హెడ్ కోచ్‌గా ఉన్న బ్రియన్ లారా స్థానంలో డానియల్ వెటోరి.. బౌలింగ్ కోచ్‌గా ఉన్న డేల్ స్టెయిన్ స్థానంలో జేమ్స్ ఫ్రాంక్లిన్‌ను నియమించుకున్నారు. ఇక సన్‌రైజర్స్ చివరగా ఐపీఎల్ టైటిల్ ను 2016లో డేవిడ్ వార్నర్ సారథ్యంలో గెలిచింది. అప్పటి నుంచి మళ్లీ గెలవలేదు. ఇక ఈ నెల 22 నుంచి ఐపీఎల్ ప్రారంభం కానుండగా, హైదరాబాద్ తన మొదటి మ్యాచ్ మార్చి 23న కోల్‌కతాతో తలపడనుంది.

## ఐపీఎల్ 17 సీజన్ మొత్తానికి డెవాన్ కాన్వే దూరం



ఐపీఎల్ 2024 ఆరంభానికి ముందు డిపెండింగ్ ఛాంపియన్ చెన్నై సూపర్ కింగ్స్‌కు భారీ షాక్ తగిలింది. చెన్నై స్టార్ ఓపెనర్, న్యూజీలాండ్ క్రికెటర్ డెవాన్ కాన్వే గాయం కారణంగా ఐపీఎల్ 17 సీజన్ మొత్తానికి దూరం కా నున్నాడు. ఎడమ బొటన వేలికి శస్త్రచికిత్స అవసరం అని వైద్యులు చెప్పా రు. శస్త్రచికిత్స అనంతరం అతడికి 8 వారాలు విశ్రాంతి తీసుకోనున్నాడు. ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. టీవల ఆస్ట్రేలియాతో జరిగిన రెండో టీ20లో డెవాన్ కాన్వే ఎడమ చేతి బొటన వేలికి గాయ మైంది. గాయం తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రస్తుతం జరుగుతున్న టెస్ట్ సిరీస్‌కు దూరమయ్యాడు. తాజాగా కాన్వేను స్కానింగ్‌కు తరలించగా.. ఫ్రాక్చర్ ఉన్నట్లు తేలింది. వైద్యులు అతడికి సర్జరీ అవసరమని సూచించారు. కాన్వే చేతి వేలికి త్వరలోనే శస్త్రచికిత్స జరగనుంది. శస్త్రచికిత్స అనంతరం అతడికి 8 వారాల పాటు విశ్రాంతి అవసరం అని వైద్యులు చెప్పారు. దాంతో మే వరకు కాన్వే ఆటకు దూరమవుతాడు. ఈ క్రమంలో ఐపీఎల్ 2024 మొత్తానికి అతడు దూరం కానున్నాడు. ఐపీఎల్ 2023 ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌పై చెన్నై సూపర్ కింగ్స్ విజయం సాధించడంలో డెవాన్ కాన్వే పాత్ర కీలకం. ఫైనల్లో 'ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్'గా కాన్వే నిలిచాడు. కాన్వే దూరమవడం చెన్నైకి భారీ ఎదురుదెబ్బ అనే చెప్పాలి. గత సీజన్‌లో 16 మ్యాచ్‌లలో 672 పరుగులు చేశాడు. అందులో ఆరు అర్ధసెంచరీలు ఉన్నాయి. 2022లో మెగా వేలంలో బేస్ ధర రూ.1 కోటికి న్యూజిలాండ్ స్టార్ కాన్వేను చెన్నై తీసుకుంది. 23 మ్యాచ్‌లు ఆడిన అతను 9 అర్ధ సెంచరీలతో 924 పరుగులు చేశాడు. చెన్నై తమ తొలి మ్యాచ్‌లో మార్చి 22న రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో చిదంబరం స్టేడియంలో తలపడనుంది.

## కోలుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్న కేఎల్ రాహుల్




క్వాడ్రిసెప్స్ గాయం కారణంగా ఇంగ్లాండ్‌తో జరిగిన చివరి మూడు టెస్టులకు దూరమైన కేఎల్ రాహుల్ కోలుకునేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నాడు. పూర్తిగా ఫిట్‌గా ఉంటాడని భావిస్తున్నారు. ఐపీఎల్ 2024 మార్చి 22 నుంచి ప్రారంభం అవనున్న సంగతి తెలిసిందే. ఐపీఎల్ 2024లో రాజస్థాన్ రాయల్స్‌తో తమ మొదటి మ్యాచ్ ఆడనున్న లక్నో సూపర్ జెయింట్స్ కెప్టెన్‌గా కేఎల్ రాహుల్ ఉన్నారు. ఈ మ్యాచ్ మార్చి 24న జైపూర్‌లో జరగనుంది. అతని కుడి తొడ కండరాలలో తేలికపాటి నొప్పి, వాపు ఉంది. ఈ గాయం కోసం నిపుణుల సలహా తీసుకోవడానికి అతను లండన్ వెళ్ళాడు. 'అతను లండన్‌లోని అత్యుత్తమ వైద్య నిపుణులను సంప్రదించాడు,' అని ఒక టైమ్స్ ఆఫ్ ఇండియా తెలిపింది. అతను ఆదివారం భారతదేశానికి తిరిగి వచ్చాడు. పునరావాసం కోసం బెంగళూరులోని %దీజజ×% ఆధ్వర్యంలో నడిచే నేషనల్ క్రికెట్ అకాడమీకి చేరుకున్నాడు. అతను త్వరలో రివ్యూ తీసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలో NCAతిరిగి ఆడటానికి సర్టిఫికేట్ అందించ నుంది. అతను తన ఫిట్ నెస్‌ను నిరూపించుకోవడానికి ఆసక్తిగా ఉన్నాడు. అతను ఐపీఎల్లో కీపర్–బ్యాట్స్‌మెన్‌గా అలాగే, టీమిండియా టీ20 ప్రపంచ కప్ జట్టులో ఎంపిక కోసం వరుసలో ఉన్నాడు.

## ఇండియా, ఇంగ్లండ్ ఐదో టెస్టు జరిగేది అనుమానమే



ధర్మశాలలోని హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరగనున్న సిరీస్ చివరి మ్యాచ్‌లో భారత్ , ఇంగ్లండ్ జట్లు మళ్లీ తలపడనున్నాయి. భారత్ ఇప్పటికే ఒక గేమ్ మిగిలి ఉండగానే 3–1 ఆధిక్యంతో సిరీస్‌ను కైవసం చేసుకుంది. చివరి మ్యాచ్ మార్చి 7 నుంచి ప్రారంభం కానుంది. అయితే ఈ మ్యాచ్ జరగడం అనుమానంగానే ఉందని అంటున్నారు. ధర్మశాల వాతావరణమే ఇందుకు కారణం. ఇండో–ఇంగ్లండ్ ఐదో టెస్టు మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశముందని, దీనికి తోడు నగరంలో చాలా చల్లని వాతావరణం ఉందని వాతావరణ నివేదికలు చెబుతున్నాయి. ది టెలిగ్రాఫ్ నివేదిక ప్రకారం 'వాతావరణం చాలా చల్లగా ఉంటుంది. వర్షం పడే అవకాశం ఉంది. గరిష్ట ఉష్ణోగ్రత 1 డిగ్రీల సెల్సియస్ , కనిష్ట ఉష్ణోగ్రత –4 డిగ్రీల కంటే తక్కువగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశం ఉంటుంది. వర్షంతో పాటు హిమపాతం కూడా మ్యాచ్‌పై ప్రభావం చూపవచ్చని నివేదిక పేర్కొంది. ఇక మ్యాచ్ కోసం ఇంగ్లండ్, భారత్ జట్లు ఆదివారం ధర్మశాల చేరుకోగా.. సోమవారం (మార్చి 4) నుంచి ప్రాక్టీస్ సెషన్‌ను ఏర్పాటు చేశారు. ధర్మశాల స్టేడియంలో ఫాస్ట్ బౌలర్లు కీలక పాత్ర పోషించే అవకాశముంది. అలాగే టాప్ ఆర్డర్ బ్యాటర్లు వికెట్లు పడకుండా చాలా జాగ్రత్తగా ఆడాలి. టాస్ గెలిచినప్పుడు భారీ స్కోర్ చేయడం కష్టం కాబట్టి, టాస్ గెలిచిన జట్టు ఛేజింగ్ చేయడం ఉత్తమ ఎంపిక. కాంగ్రా లోయలోని ధౌలాధర్ శ్రేణిలో 1,457 ఎత్తులో, గంభీరమైన హిమాలయ పర్వత శ్రేణుల ఒడిలో క్రికెట్ స్టేడియం ఉంది. ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన క్రీడా మైదానం. ధర్మశాలలోని హిమాచల్ ప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌పిసిఏ) స్టేడియంలో భారత్–ఇంగ్లండ్ జట్ల మధ్య జరగనున్న ఐదో టెస్టు రవిచంద్రన్ అశ్విన్ కి వందో టెస్టు మ్యాచ్. దీంతో 100 టెస్టు మ్యాచ్‌లు ఆడిన 14వ భారత, రెండో భారత స్పిన్నర్‌గా రికార్డులకెక్కనున్నాడీ సీనియర్ స్పిన్నర్.

## టార్గెట్ చేశాడు.. చివరికి బ్రేక్ చేశాడు?



టీమిండియా జట్టులో స్టార్ ప్లేయర్గా కొనసాగుతున్న రవిచంద్రన్ అశ్విన్ గురించి ప్రపంచ క్రికెట్ ప్రేక్షకులకు కొత్తగా పరిచయం చేస్తే.. అది అతిశయోక్తి అవుతుంది అని చెప్పాలి. ఎందుకంటే తన ఆట తీరుతో ఇప్పటికే ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకున్నాడు అశ్విన్. ముఖ్యంగా టెస్ట్ ఫార్మట్ లో అశ్విన్ సాధించిన రికార్డులు అయితే అసమాన్యమైనవి అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇక ఎంతోమంది దిగ్గజాలు సాధించిన రికార్డులను అలవోకగా బద్దలు కొట్టి తనకు తిరుగులేదు అని నిరూపించుకున్నాడు అశ్విన్. అందుకే టెస్ట్ ఫార్మట్ లో ఎవరైనా కొత్త ఆటగాడు రికార్డులు సాధించాడు అంటే అతన్ని భారత సీనియర్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ తో పోల్చి చూడడం చేస్తూ ఉంటారు. అయితే నేటి తరంలో టెస్ట్ ఫార్మట్ లో అశ్విన్ కు గట్టి పోటీ ఇస్తూ ఇక అతని రికార్డులకు ఎసరు పెడుతున్న మరో బౌలర్ ఎవరైనా ఉన్నారు అంటే అతను ఆస్ట్రేలియా బౌలర్ నాథన్ లియోన్ మాత్రమే అని చెప్పాలి. ఇక అశ్విన్ తో పాటుగానే అతను కూడా రికార్డుల వేట కొనసాగిస్తూ అదరగొడుతూ ఉంటాడు. ఇక జట్టు విజయాలలో ఎప్పుడు కీలక పాత్ర వహిస్తూ ఉంటాడు అని చెప్పాలి. ఈ క్రమంలోనే ఇక అశ్విన్ రికార్డులను ఇప్పటివరకు ఎన్నోసార్లు బద్దలు కొట్టిన నాథన్ లియోన్ ఇక ఇటీవలే మరో రికార్డులు కూడా దాటేసాడు. ప్రస్తుతం ఆస్ట్రేలియా జట్టు న్యూజిలాండ్తో టెస్ట్ సిరీస్ ఆడుతుంది అన్న విషయం తెలిసిందే. నువ్వా నేనా అన్నట్లుగానే హోరాహోరీగా ఈ టెస్ట్ సిరీస్ సాగుతుంది. అయితే ఇటీవలే ముగిసిన టెస్టులో రెండో ఇన్నింగ్స్ లో ఏకంగా 5 వికెట్ల హాల్ సాధించాడు నాథన్ లియోన్. ఇక ఈ ప్రదర్శనతో అశ్విన్ రికార్డును బద్దలు కొట్టాడు అని చెప్పాలి. వరల్డ్ టెస్ట్ చాంపియన్షిప్ లో మొత్తం పదిసార్లు ఐదు వికెట్ల హాల్ సంపాదించాడు నాథన్ లియోన్. ఈ క్రమంలోనే 9సార్లు ఐదు వికెట్లు తీసిన అశ్విన్ పేరిట ఉన్న రికార్డింగ్ ఇప్పుడు లియోన్ బదులు కొట్టాడు. అయితే ఇటీవల ముగిసిన మ్యాచ్ లో ఏ కేవలం ఐదు వికెట్లు మాత్రమే కాదు ఏకంగా లియోన్ 10 వికెట్లు తీశాడు అని చెప్పాలి.

## అతన్ని అందుకే మహితో పోల్చా : గవాస్కర్



టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీకి ఉన్న క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. ఏకంగా ఒక రైల్వే టికెట్ కలెక్టర్ స్థాయి నుంచి దేశం గర్వించదగ్గ క్రికెటర్ స్థాయికి ఎదిగిన ధోని ప్రస్థానం ప్రతి ఒక్కరికి కూడా స్ఫూర్తిదాయకం అని చెప్పాలి. ఒక సాధారణ క్రికెటర్ గా జాతీయ జట్టులోకి వచ్చి ఏకంగా కెప్టెన్ గా బాధ్యతలు చేపట్టాడు. కెప్టెన్సీ చేపట్టిన తర్వాత టీమ్ ఇండియాకు అందని ద్రాక్షలా ఉన్న వరల్డ్ కప్ ను రెండుసార్లు అందించాడు మహేంద్ర సింగ్ ధోని. ఇక తన కెప్టెన్సీ తో భారత క్రికెట్ అనే పుస్తకంలో ప్రత్యేకమైన పేజీలు లికించుకున్నాడు అని చెప్పాలి. అందుకే యుగానికిఒక్కడే యుగపురుషుడు ఉంటాడు. అలాగే భారత క్రికెట్ కి అతని తరానికి ధోని ఒక్కడు మాత్రమే ఇలాంటి యుగ పురుషుడు అని క్రికెట్ విశ్లేషకులు కూడా అభివర్ణిస్తూ ఉంటారు అని చెప్పాలి. అయితే ఇక ధోని లాగా ఎవరైనా యువ ఆటగాడు అంతర్జాతీయ క్రికెట్లో రాణించాడు అంటే చాలు అతని ధోనితో పోల్చి ప్రశంసలు కురిపించడం లాంటివి చేస్తూ ఉంటారు. అయితే ఇటీవలే అటు భారత జట్టు తరపున ఛాన్స్ దక్కించుకొని మంచి ప్రదర్శన చేసిన ధృవ్ జురేల్ పై కూడా ఇలాంటి ప్రశంసలు కురిపించారు కొంతమంది మాజీలు. ఏకంగా అతన్ని మాజీ ప్లేయర్ మహేంద్ర సింగ్ ధోనితో పోల్చారు అని చెప్పాలి. అయితే ఆ యువ ఆటగాడిని ధోని లాంటి లెజెండ్ తో పోల్చడం ఏంటి అని కొన్ని విమర్శలు కూడా వచ్చాయ్. ఇక ఇదే విషయంపై టీమిండియా మాజీ ప్లేయర్ గవాస్కర్ స్పందిస్తూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఎంఎస్ ధోని వంటి మరో ఆటగాడు ఇక క్రికెట్లోకి రాడు అంటూ గవాస్కర్ చెప్పుకొచ్చాడు. అయితే యువ ఆటగాడు ధృవ జురెల్ ను తాను ధోనితో పోల్చడం వివరణ ఇచ్చాడు. ఆ వ్యాఖ్యల్లో నా ఉద్దేశం జూరెల్ సమయస్ఫూర్తి ఆటతీరు ధోనిని గుర్తు చేస్తున్నాయి అనే తప్ప. అతను ధోనితో సమానం అని కాదు. ధోని లాంటి ఆటగాడు ఒక్కరు మాత్రమే. ఇక మరొకరు రారు కూడా అంటూ గవాస్కర్ వ్యాఖ్యానించాడు. ధోని సాధించిన దాంట్లో జురెల్ కొంత సాధించిన భారత క్రికెట్కు మేలు చేకూరినట్లే అంటూ గవాస్కర్ చెప్పుకొచ్చాడు.




EDITED, PRINTED AND PUBLISHED BY CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL01938. FILE NO.1349985
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com